# మిసిమి

మాస పత్రిక

జనవరి - 2000

వెల - రూ॥ 8/-



# ముఖచిత్ర - చిత్రకారుని గురించి



నికొలస్ పౌసిన్

నికొలస్ పౌసిన్ (1594 - 1665) పదిహేడవ శతాబ్దికి ఫ్రాన్స్‌కు చెందిన సాంప్రదాయిక చిత్రకారుడు. ఇతడు నార్మండీలో ఒక చిన్న నగరమైన అండెలిలో 1594లో - కులీన కుటుంబంలో జన్మించాడు. మొదటిగ చిత్రకళలో ఇతనికి ఊపిరి పోసినవాడు క్వెంటిన్ వారిన్. ఇతనిని చూసే పౌసిన్ తానొక కళాకారుడిని అయితీరాలనుకొన్నాడు. తన పద్దెనిమిదో ఏట అంటే 1612లో తన లక్ష్యాన్ని యధార్థం చేసుకోవాలనే కోర్కెతో, రహస్యంగా ఇల్లు వదిలి పారిస్ చేరుకొన్నాడు. అక్కడ ప్రాచీన సంప్రదాయ ప్రామాణిక కళాఖండాలమీద మక్కువ పెంచుకొన్నాడు. తన భవిష్యత్తు ఈ పరంగా ఇటలీలో దాగి ఉందని గ్రహించాడు. 1624లో రోమ్ వచ్చి, డొమినిచినో స్టూడియోలో చేరాడు. ఫ్రాన్స్‌లో ఉన్న ఆ కొద్దికాలం తప్ప జీవితం అంతా రోమ్‌లోనే గడిపాడు.

పౌసిన్ అనేక వస్తువుల (subjects)తో ప్రయోగాలు చేశాడు. ఇతని చిత్రాలు వ్యవస్థీకృతంగా, క్రమబద్ధంగా, నైతికంగా ప్రబోధించేవిగా ఉంటాయి. అతడు ఎటువంటి బాధనైనా భరించగల ధీరోదాత్తుడు. ఆ ధీరోదాత్తత అతని చిత్రాలలో లీనాలీనంగా కనిపిస్తుంది.

ఈయన కృతులు, తరువాతి రెండు శతాబ్దాలను, ఫ్రాన్స్ చిత్రకళను ప్రభావితం చేసింది.

ప్రాచీన రోమ్ ఉబ్బెత్తు (relief) కళాఖండాలు ఇతనిని ఎంతగానో ప్రభావితం చేశాయి. ప్రాచీన ప్రపంచం అన్ని ముఖాలు, శిల్పం, సంగీతం, కవచాలు, తత్వం అతన్ని ఆకట్టుకొన్నాయి. అతడు వాటిని వేటిని తిన్నగా అనుకరించలేదు. కాని వాటి వాటి స్ఫూర్తిని, సారాన్ని తన కళలో నిక్షిప్తంచేయడానికి ప్రయత్నించాడు.

1665లో బెరినినికి పౌసిన్ కృతులను చూపినప్పుడు, ఆయన తన నుదిటిమీద చేతితో తట్టుకొని '' ఇక్కడ నుంచి పెయింట్ చేసే చిత్రకారుడొకడితడు'' అని మెచ్చుకోలుగా అన్నాడు. ఇది పౌసిన్‌కు ఎంతో తృప్తి నిచ్చింది.

**ముఖ చిత్రం : ''సాంప్రదాయిక స్ఫూర్తి''**

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 12 జనవరి 2000 సంచిక 1

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ **రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయసూచిక


| | |
|---|---|
| వ్యాఖ్యాన శాస్త్రం | - బి. తిరుపతిరావు |
| జీవిత గమ్యం : మధుమాసం, నీలినీడలు | - సి. ఎల్. ఎల్. జయప్రద |
| అశ్వఘోషుడు – కాళిదాసు | - టి. రవిచంద్ |
| జ్ఞానవికాసంలో తర్కం పరిధి | - బి. ఎస్. రాములు |
| వేమన | - డా. బి. పార్వతి |
| 21వ శతాబ్ది తాత్వికుడు పీటర్ సింగర్ | - డా. ఎన్. ఇన్నయ్య |


విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **''సాంప్రదాయిక స్ఫూర్తి''**

**Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd., 1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 7645536**
**e-mail : misimi_m@hotmail.com**
**http : //www.misimi.com**

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# మూడో సహస్రాబ్ది ప్రారంభం ఎప్పుడు?

మానవ ప్రవృత్తి చాల విచిత్రమైంది. పదిమంది ఒక మాటంటే, అదే వేదమంటారు. పదిమంది అదే చెప్పినందువల్ల అదే సత్యమైపోదు. పదిమంది బాటను అనాలోచితంగా ఆచరించడం అంటే, అది గొర్రెదాటు వ్యవహారం. అది బాండ్ వాగన్ వ్యవహారమవుతుంది. మనకూ బుర్ర ఉంది, మనమూ ఆలోచించాలి. అన్ని విషయాలు ఆలోచించగానే మనకు తెలుస్తాయని కాదు. కొన్ని సార్లు సరళమైన, తేలికైన విషయాలను గురించి మనం ఆలోచించం. అలాంటి తేలికగా ఆలోచిస్తే అర్థమయ్యే విషయమే మూడో సహస్రాబ్ది ప్రారంభ విషయం.

మూడో సహస్రాబ్ది వాస్తవానికి 2001 సంవత్సరం జనవరి 1 వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. కాని బాగా చదువుకొన్న వారు, పత్రికలు, జనబాహుళ్యం, పెళ్ళి ముహూర్తాలు పెట్టే గణకులు - ఒకరేమిటి అందరూ మూడో సహస్రాబ్ది 2000 జనవరి 1 వ తేదీ నుంచి - అంటే ఈ నెల 1 వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని కోడై కూస్తున్నారు. ఆర్భాటం చేస్తున్నారు. నూతన మిలినియమ్‌కు స్వాగతం చెబుతున్నారు. తోరణాలు కడుతున్నారు. 2000 సంవత్సరం ఫిబ్రవరి నెలకు ముప్పై రోజులైతే క్యాలెండర్లు 29 రోజులని ముద్రించాయి. ప్రజలు బాండ్ వాగన్ ప్రభావంలో పడిపోతుంటే, గొర్రె దాటు వ్యవహారంలో పడుతుంటే, సరిదిద్దాల్సింది పత్రికలు. ఆ పత్రికలే పని కట్టుకొని ఈ వేయి సంవత్సరాలలోని శాస్త్రవేత్తల, మహామహుల, గొప్ప అద్భుత సంఘటనల, సాంస్కృతిక పరివర్తనల గురించి రాస్తున్నాయి, రాయిస్తున్నాయి.

శాస్త్ర విజ్ఞానం పెరిగి కంప్యూటర్లు, వ్యోమ నౌకలు రాజ్యం ఏలుతున్న ఈ రోజుల్లో - మామూలు జనంగాక - పత్రికలు నూతన సహస్రాబ్దిని ఒక సంవత్సరం ముందుగా ఆహ్వానించడానికి కారణం అర్థం కాదు. ఫ్యూచర్ షాక్ ఇవ్వడానికా? అదీ కనపడదు.

నార్లేకర్, క్లార్క్ మొదలైన శాస్త్రవేత్తలు మూడో సహస్రాబ్ది 2001 జనవరి 1 వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని చెప్పినా ఎవరూ వినిపించుకోవడం లేదు. అంత పెద్దవారు దీనిని గురించి చెప్పనక్కరలేదు. ఒంట్లు లెక్క పెట్టడం చేతనయినా చాలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి తొమ్మిదో సంవత్సరం పూర్తి అయిన తరవాత గదా 10వ సంవత్సర ప్రారంభం. పదో సంవత్సరం పూర్తిగా పూర్తి అయిన తరవాతగదా పదకొండో సంవత్సరం ప్రారంభమయ్యేది. పదో సంవత్సరం మొదటి దశాబ్దిలోకి వెళ్తుంది. రెండో దశాబ్దికి మొదలు ఏది? పదకొండో సంవత్సరంలో మొదటి రోజు. ఆ విధంగా పదకొండో సంవత్సరం రెండో దశాబ్దికి మొదటి సంవత్సరం అవుతుంది. ఆ సంవత్సరంలో మొదటి రోజు అంటే పదకొండో సంవత్సరంలో మొదటి రోజు రెండో దశాబ్దికి మొదటి రోజు అవుతుంది. మూడో సహస్రాబ్ది విషయంలోనూ అంతే.

ఈ గందరగోళం ఇలా ఉంటే కొంతమంది పెళ్ళిలగ్నాలు పెట్టేవారు, 2000 సంవత్సరంలో అంటే ఆ సంఖ్యలో మూడు సున్నలున్నాయి అందుకని పెళ్ళి ముహూర్తాలు లేవు అని ప్రచారం చేస్తున్నారు. ఇదొక పిచ్చిగోల.

మామూలుగా ముహూర్తాలు తిధి , వార, నక్షత్రాల ఆధారంగా నిర్ణయిస్తారు. (ఇది శాస్త్రీయమని మనం అనడం లేదు) కాని 'సున్నల' ఆధారంగా ముహూర్తాలు నిర్ణయించడం మనం ఎరగం. (బ్రాహ్మిలిపి

Continued on Page No. 18

# వ్యాఖ్యాన శాస్త్రం (HERMENEUTICS)

**- బి. తిరుపతిరావు**

(ఈ శీర్షిక క్రింది నెలనెల ఒక భావననో లేదా ఇజాన్నో ఒక పారిభాషిక పదాన్నో పరిచయం చేయడం జరుగుతుంది. కొన్ని భావనల పేర్లను మనం వింటూ ఉంటాం. అదేదో మనకు తెలిసినట్టుగానే ఉంటుంది. కాని అదేమిటో 'ఇదమిద్ధంగా' తెలియదు మన తెలియని తనంలోకి ఆ 'ఇదమిద్ధత'ను ప్రవేశపెట్టడమే ఈ శీర్షిక ఉద్దేశం. ఈ శీర్షిక నిర్వహణకు బి. తిరుపతిరావు అంగీకరించారి తెలియజేయడానికి సంతోషిస్తున్నాం - సం)

వ్యాఖ్యాన శాస్త్రం అనేది ఒక వ్యాఖ్యాన పద్ధతి. 'హర్మాన్యూటిక్స్' అనే పదం గ్రీకు భాషలోని 'హర్మాన్యూటికాస్' నుంచి రూపొందింది. 'హర్మాన్యూటికాస్' అంటే వ్యాఖ్యానంలో నైపుణ్యం కలవాడు లేక విషయాల్ని స్పష్టం చేసేవాడు అని అర్థం. 'హెర్మస్' అనే గ్రీకు దేవుడితో ఈ పదానికి సంబంధం వుంది. హెర్మస్ గ్రీకు పురాణాల్లో దేవతలకి వార్తాహరుడు. జిత్తులమారి తనం, పరిశోధక లక్షణాలు కల హెర్మస్ దొంగకూడా. (ఈ లక్షణాలు విమర్శకుల్లో మనకు కనిపించేవే) 'హెర్మాన్యూటికాస్'కి స్పష్టపర్చటం, వివరించటం అనే అర్థాలు కూడా వున్నాయి.

ప్రారంభంలో ఈ పదం బైబిల్‌కు సంబంధించిన వ్యాఖ్యానాల్ని పరిశీలించే అంశంగా వుండేది. అప్పుడు ఈ శాస్త్రపు ప్రధాన లక్ష్యం బైబిల్‌లోని 'నిజమైన అర్థాన్ని' కనుగొనటం. ఈ శాస్త్రం చాలా కాలం, దాదాపు పదహారవ శతాబ్దం వరకూ ప్రాచీన బాషాశాస్త్రం **(Philology)** లో బాగంగా వుంది. లేకపోతే ఉపాంగంగా వుంది.

ప్రాచీన కాలంలో క్రైస్తవ మతానికి చెందిన చాలా వాచకాలు నిరంతరం తిరిగి రాయబడుతూ వుండటం వల్ల ఆ వాచకాలలో అనేక మార్పులు చోటు చేసుకోవటం, అర్థాలు మారటం, తప్పులు దొర్లటం, కొన్ని అంశాలు వదిలివేయబడటం జరుగుతూ వుండేది. ఈ స్థితిలో ఒక వాచకపు ప్రామాణికతని నిర్ధారించటానికి వ్యాఖ్యానశాస్త్రం రంగంమీదకు వచ్చింది. ఒక వాచకపు నిజమైన అర్థాన్ని నిర్ధారించటం ఈ శాస్త్రం పనిగా వుండేది. ఈ అర్థ నిర్ధారణ అనేది ఎక్కువ సందర్భాలలో బాషాశాస్త్రం మీద ఆధారపడటం ద్వారా జరిగేది. ఒక వాచకం తిరిగి రాయబడినపుడు కోల్పోయిన అర్థాన్ని తిరిగి ప్రతిష్ఠించటం ఈ శాస్త్ర లక్ష్యంగా వుండేది.

పదహారవ శతాబ్దంలో క్యాథలిక్‌లకు, ప్రొటస్టాంట్లకు మధ్య బైబిల్ ప్రామాణికతకు సంబంధించిన చర్చ మొదలు కావటంతో వ్యాఖ్యానశాస్త్ర ప్రాముఖ్యత పెరిగింది. ఈ చర్చలో వ్యాఖ్యాన శాస్త్రపు వివరణలు తిరుగులేనివిగా వుండటం, శతాబ్దాల పాటు ఆ వివరణల్ని ఎవరూ ఖండించకపోవటంతో ఈ శాస్త్ర స్థాయి పెరిగింది. క్రమంగా ఈ శాస్త్రం మానవీయ శాస్త్రాలన్నింటిలోకి చొచ్చుకు రాగలిగింది, వాటిలో బాగమయింది. న్యాయశాస్త్రంలో దాని పాత్ర గణనీయంగా వుంది.

ఆధునిక యుగంలో వ్యాఖ్యానశాస్త్రం సామాజిక శాస్త్రాలకి సవాలుగా నిలిచిందంటాడు ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త జిగ్మంట్ బౌమన్. ఆధునికతకి ముందు కాలంలో కేవలం అర్థాల్ని నిర్ధారించటంలో, పరిష్కరించటంలో ఒక పరికరంగా వుపయోగపడుతూ వచ్చిన ఈ శాస్త్రం ఆధునిక యుగంలో తన పాత్రని మార్చుకుంది. ఈ శాస్త్రం సమస్యల్ని పరిష్కరించటానికి ఉపయోగపడే సాధనంగా వుండటానికి బదులు అదే సమస్యగా పరిణమించింది. చారిత్రక జ్ఞాన స్వభావాన్ని, లకాల్ని గురించిన తాత్విక ప్రశ్నల్ని వేయటం మొదలు పెట్టింది. వాచకాలకి అఖండ అర్థాల్ని ఆపాదించటం ప్రారంభించింది.

వ్యాఖ్యాన శాస్త్రం రూపొందిన ప్రారంభ కాలంలో రచన మీద రచయిత ఆధిపత్యం అంతగా వుండేదికాదు. రచయిత జీవిత విశేషాలు, అభిప్రాయాలు మొదలయిన వాటి మీద కంటే ఈ శాస్త్రం రచన మీదనే ఎక్కువ దృష్టిని కేంద్రీకరించేది. నిజానికి రచనకు సంబంధించి లభించే అంశాలతో పోల్చినప్పుడు రచయితకు సంబంధించిన విశేషాల్ని అంతగా నమ్మటానికి ఆస్కారం లేదు, వుండేది కాదు. పద్దెనిమిదో శతాబ్దపు మధ్య కాలం వరకూ ప్రాచీన సౌందర్య శాస్త్రాలు రాజ్యం చేస్తూ వుండటం వల్ల రచయిత వైయుక్తిక అభీష్టాలకి, అభిప్రాయాలకి, అభిరుచులకు అంతగా ప్రాముఖ్యం వుండేది కాదు. రచన మీదనే ఎక్కువ దృష్టిని కేంద్రీకరించటం జరిగేది. రచనలో రచయిత మూర్తిమత్వానికి ప్రాధాన్యం లేదు. అసలు రచయిత మూర్తిమత్వాన్ని ప్రతిఫలించిన రచనని అపరిణిత రచనగా చూడటం జరిగింది.

జ్ఞాన గ్రహణ క్రమంలో విషయి **(Subject)** కున్న ప్రాధాన్యత గురించి కాంట్ వాదనలకి ప్రాముఖ్యత ఏర్పడ్డ నేపధ్యంలో ఒక రచనని సృష్టించిన రచయితకి గుర్తింపు పెరిగింది. సమాజ రాజకీయ, ఆర్థిక రంగాలలో వ్యక్తివాదం బలపడుతూ వచ్చిన క్రమంకూడా ఇక్కడ గుర్తించాల్సిన అంశం. పద్దెనిమిదోవ శతాబ్దపు చివరి దశకాల్లో మాత్రమే రచయిత అనే వాడికి ప్రాధాన్యం, గౌరవం, రచన మీద విశేష అధికారం ఏర్పడటం జరిగింది. ఇదే కాలంలో రూపు దిద్దుకుంటూ వున్న నవల అనే ప్రక్రియ ద్వారా రచయిత ఆంతరంగిక ప్రపంచపు ప్రాముఖ్యతని గురించి నవలాకారులు ప్రస్తావించటం కన్పిస్తుంది. కవి షెల్లీ మాటల్లో చెప్పాలంటే అనధికార శాసనకర్తగా రచయిత రూపొందటం మొదలయిన కాలం కూడా ఇదే. ఒక రకంగా కాల్పనిక సాహిత్య యుగం దీనికి సాధికారతని కల్పించింది.

ఎప్పుడైతే 'రచయితని అర్థం చేసుకుంటే తప్ప రచనని సరిగా అర్థం చేసుకోలేమనే భావం బలపడిందో ఆ మరుక్షణమే వ్యాఖ్యాన శాస్త్రం తన దృష్టిని రచనా నిర్మాణ, విశ్లేషణ, వర్ణనల నుంచి విస్తరించి ఒక రచనలో రచయిత ఉద్దీపించిన, రూపొందించిన అంతరార్థాన్ని వెలికి తీసే ప్రయత్నం మీద కేంద్రీకరించటం మొదలు పెట్టింది. ఈ క్రమంలోనే వ్యాఖ్యాన శాస్త్రం రచయితని, పాఠకుణ్ని ఆత్మికంగా ఏకం చేసే ప్రయత్నాన్ని ఒక దగ్గరకి చేర్చే ప్రయత్నాన్ని తన భుజాలమీదకు ఎత్తుకుంది. ఫలితంగా వ్యాఖ్యానశాస్త్రం సాంకేతికమైన పనిని నిర్వర్తించటం నుంచి తాత్వికపాత్రలోకి ప్రవేశించింది.

ప్రముఖ ఆధునికానంతర వాదులందరూ ఈ వ్యాఖ్యాన శాస్త్రాన్ని నిరాకరిస్తారు. వాచకానికి ఒక 'సహజ' అర్థం 'నిజ అర్థం' వుంటుందనే భావనకి ఆధునికానంతర వాదులు వ్యతిరేకులు. వాచకం కూడా ప్రవహించే నదిలాంటిదే. కాబట్టి ఏ వాచకాన్ని రెండుసార్లు ఒకే రకంగా చదవలేమనేది ఆధునికానంతర వాదుల అభిప్రాయం.

# జీవిత గమ్యం : మధుమాసం, నీలినీడలు

## (1951 నోబెల్ సాహిత్య బహుమతి పురస్కారోపన్యాసము)

మూలం : **పార్ లాజర్ క్విస్ట్** అనువాదం : **సి.ఎల్.ఎల్. జయప్రద**

నోబెల్ బహుమతి ఇచ్చిన స్వీడిష్ అకాడమీకి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇది ఎంత మహోన్నతమైన గౌరవమంటే, నాకు నేను దానికి నేను అర్హుణ్ణా అన్న ప్రశ్న వేసుకోవటంలో తప్పులేదు. ఈ పురస్కారం గురించి నిర్ణయం తీసుకోవటంలో నా పాత్ర లేదు కనుక దీనిని నిర్మలమైన మనస్సుతో నేను స్వీకరించగలను.

ఇవాళ మనం గొప్పగొప్ప ఉపన్యాసాలు విన్నాం మరి కొన్ని వినబోతున్నాము కనుక నేను ఇంకా ప్రచురించని నా పుస్తకంలో నుండి కొంత భాగాన్ని ఉపన్యాసానికి బదులు చదువుతాను. నేనీ మహోన్నతమైన సమయంలో ఏం మాట్లాడాలి అని ఆలోచిస్తుంటే ఒక వింత సంఘటన జరిగింది. 1922 కాలం నాటి పుస్తకం, చేతివ్రాతలోనున్నది, నాకు ఇరవైతొమ్మిది సంవత్సరాలక్రిందట దొరికింది. నేనివ్వాళ చెప్పి ఉండాల్సిన విషయాలు అందులో కొంత భాగంలో కన్పించాయి. అవి కథ రూపంలో చెప్పటం నా కిష్టమైన పద్ధతి. ఇది మానవ జీవితంలో గమ్యాన్ని ఒకే సమయంలో ఉత్కృష్టమైనదిగానూ కఠినమైన దానిగానూ చేసే నిగూఢమైన ప్రశ్నల గురించి.

ఈ కథ ముప్పై సంవత్సరాలక్రితం మెడిటేరియన్ ప్రాంతం ఒక అందమైన గ్రామంలో నేనున్నప్పుడు రాసింది. అందులో కొంత భాగం ఇప్పుడు చదువుతాను.

### మానవ జాతి గాథ :

ఒకానొకప్పుడు ఒక లోకం ఉండేది. ఒక స్త్రీ, ఒక పురుషుడు అక్కడ కొద్ది కాలం మాత్రమే ఉండటానికి ఒక రోజు సూర్యోదయపు వేళ వచ్చారు. మరెన్నో లోకాలు తెలిసిన వాళ్ళకి ఆలోకం అల్పమైనదిగా కన్పించింది. పచ్చని చెట్లతో, పర్వతాలతో, అడవులతో, ఆకాశంలో కదలిపోయే మేఘాలతో, మంద్రంగా సంధ్య వేళల్లో కదలుతూ నిగూఢంగా అన్నిటినీ కదలిస్తూ, సందడి చేసే గాలులతో ఆ ప్రపంచం కూడా అందంగానే ఉండేది. ఆ అందమైన ప్రపంచంలో వాళ్ళు కొన్నాళ్ళుందామని నిర్ణయించుకున్నారు. వాళ్ళ పరస్పర ప్రేమ కూడా అక్కడ మరింత అద్భుతంగా ఉంది. అక్కడ ప్రేమ అన్నిటినీ అలవాటుగా అలరించేదిగా కాక అప్పుడప్పుడు వచ్చిపోతూ ఆశ్చర్యపరచే అతిథిలాగా ఉంది. అప్పటివరకూ వాళ్ళ జీవితాలలోని సహజంగా, స్వచ్ఛంగా ఉన్నదంతా ఇప్పుడు నిగూఢంగా తయారయింది. వాళ్ళిప్పుడు అవ్యక్తమైన శక్తుల చేతిలో చిక్కిన పరదేశస్తులు. ఇన్నాళ్ళూ వాళ్ళని కలిపి ఉంచిన ప్రేమ అద్భుతమైపోయింది. అది నాశనము కలది, కరగిపోయి మరణించగల్గింది. అందుచేత వాళ్ళు తాము కనుక్కున్న నూతన ప్రపంచంలో కొన్నాళ్ళుందామనుకున్నారు.

అక్కడ సూర్యకాంతి ఎల్లప్పుడూ ఉండదు. పగటి కాంతి తర్వాత సంధ్య అన్నిటిపైనా పరచుకుని వాటిని మరుగైపోయేట్లు చేస్తుంది. ఆ పురుషుడు, స్త్రీ చీకట్లో ఒకరి ప్రక్కన ఒకరు చెట్లతో ఊసులాడే

గాలిని వింటూ పడుకున్నారు. వాళ్ళు ఒకరికొకరు దగ్గరగా జరిగి అక్కడ తామెందుకున్నామని ప్రశ్నించుకున్నారు.

ఆ పురుషుడు తమ కోసం, ఎలాగూ కొద్ది రోజులు ఉంటాం కదా అని, రాళ్ళతోనూ నాచుతోనూ ఇల్లు కట్టాడు. ఆమె చక్కటి సువాసన గల గడ్డి నేలపై పరచి సంధ్యవేళల్లో అతని కోసం ఎదురు చూసేది. వాళ్ళు అంతకుముందు కంటే ఎక్కువగా ఒకర్నొకరు ప్రేమించుకుంటూ మామూలు జీవనం కొనసాగించారు.

ఒకరోజు అతను పొలం పనిలో ఉండగా తాను ప్రాణాధికంగా ప్రేమిస్తున్న ఆమెపై మక్కువ పొంగి పొరలగా అతడు ముందుకు వంగి ఆమె పడుకుని లేచిన భూమిని ముద్దుపెట్టుకున్నాడు. ఆమె చెట్లపైన మబ్బులపైన మమకారం పెంచుకుంది. వాటి క్రింద నుండి నడచి అతను తనను చేరటానికి ఇంటికి వస్తాడని, ఆమెకి సంధ్య వేళన్నా ప్రేమే, ఆ సమయంలో అతడు ఇంటికి వస్తాడు కనుక. అదొక వింత ప్రపంచం, ఇంతకు ముందు తామున్న లోకాలకు భిన్నమైంది.

ఆమె అలా ఒక రోజు ఒక పుత్రుడికి జన్మనిచ్చింది. ఆరుబయట ఉన్న సిందూరపు చెట్లు జోలపాడగా ఆ బిడ్డ ఉలిక్కి పడిలేచి, చుట్టూ చూసి గాలి సయ్యాటలకి జోకొట్టినట్లు మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు. కానీ ఆ పురుషుడు రాత్రిళ్ళు తాను చంపిన జంతువుల రక్తసిక్తమైన కళేబరాలు మోసుకుంటూ అలసిపోయి విశ్రాంతి కోరుకుంటూ ఇంటికి వచ్చేవాడు. చీకట్లో పడుకుని, ఆ స్త్రీ పురుషులు తాము మరి కొన్నాళ్ళలో వెళ్ళిపోయే సంగతి గురించి సంతోషంగా మాట్లాడుకునేవారు.

ఎంత వింత లోకం ఇది! వేసవితరువాత వర్షాకాలం, తరువాత వణికించే చలికాలం, చలికాలం తరువాత ఆహ్లాదాన్నిచ్చే వసంతం. కాలం కదిలిపోతూ ఒక ఋతువు తరువాత ఒక ఋతువు ఏదీ ఎక్కువ కాలం ఉండదు. ఆ స్త్రీకి ఇంకొక కొడుకు, మరి కొన్నాళ్ళ తరువాత ఇంకొక కొడుకూ పుట్టారు. ఆ పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయి ఎవరి వ్యాపకాల్లో వారుపడిపోయారు. వాళ్ళు పరుగులెడుతూ, ఆడుతూ పాడుతూ ప్రతిరోజూ కొత్త విషయాలు గమనిస్తూ ఉన్నారు. వాళ్ళకి ఈ అద్భుతమైన ప్రపంచం, అందులోని ప్రతి వస్తువూ ఆట వస్తువులే అయ్యాయి. ఆ పురుషుడి చేతులు పొలాల్లో, అడవుల్లో పని చేసి కాయలు కాసాయి. ఆమె ముఖం ఇదివరకటి నేవళం కోల్పోయినా, ఆమె అడుగుల్లో పూర్వపు చురుకుదనం లేకపోయినా, ఆ గొంతులో మృదుత్వం, మాధుర్యం మాత్రం తగ్గలేదు. ఒకరోజు సాయంకాలం ఇంటిపనులన్నీ అయింతరువాత పిల్లలు ఆమె చుట్టూ చేరినప్పుడు ఆమె వాళ్ళతో ఇలా చెప్పింది. ''మనం వేరే లోకం నుండి ఇక్కడకు వచ్చాం. తిరిగి తొందరలో అక్కడికే వెళ్ళి పోతాం.''

పిల్లలు ఆమెవంక విస్మయంగా చూశారు. ''నువ్వేం చెప్తున్నావమ్మా? ఇది కాక వేరే లోకాలు కూడా ఉన్నాయా?'' ఆ తల్లి కళ్ళు భర్తకళ్ళను కలుసుకోగా వాళ్ళిద్దరి కళ్ళల్లో బాధ కలుక్కుమంది. ఆమె శాంతంగా సమాధానం చెప్పింది. ''తప్పకుండా వేరే లోకాలున్నాయి.'' వాళ్ళు నివసించే ప్రపంచానికి

భిన్నంగా ఉన్న ఆ లోకాల్లో ప్రతి ప్రదేశం ఎంతో విశాలంగా, అద్భుతంగా, ఎక్కడా చీకటి లేకుండా, పాడే చెట్లుకుడా లేకుండా, దేనికీ ప్రయాస పడే అవసరం లేకుండా ఎలా ఉంటుందో ఆమె వాళ్ళకి వివరించింది. మధ్య మధ్య వాళ్ళు తలెత్తినిజమేనా అన్నట్లు చూడగా అతడు అవునన్నట్లు తలాడించి తన ఆలోచనల్లో మునిగి పోయాడు. ముఖం పాలిపోగా, కళ్ళు వింతగా మెరుస్తుండగా అందరి కంటే చిన్నవాడు తల్లి కాళ్ళ దగ్గరగా కూర్చున్నాడు. దూరంగా కూర్చుని శూన్యంలోకి చూస్తున్న పెద్ద పిల్లవాడు, పన్నెండేళ్ళవాడు చివరకు లేచి బయటకు చీకట్లోకి వెళ్ళి పోయాడు.

తల్లి కథ చెప్తూనే ఉంది, పిల్లలు ఆసక్తిగా వింటూనే ఉన్నారు. ఎక్కడో దూర దేశాన్ని చూస్తూ మాట్లాడుతున్నట్లు ఆమె మధ్య మధ్యలో ఏదో చూడలేకపోతునట్టు, గుర్తురానట్టు ఆగిపోయింది. కాసేపాగి లోస్వరంతో మళ్ళీ ఆమె కథ మొదలుపెట్టింది. మసిబారిన నిప్పు గూట్లో అల్లలాడుతున్న మంట, వాళ్ళ ముఖాలపై మెరిసి, గదిలో వెలుతురు పరచింది. తండ్రి తన కళ్ళ కడ్డంగా చెయ్యి పెట్టుకున్నాడు. అలా కదలకుండా వాళ్ళు మధ్య రాత్రి వరకూ కూర్చున్నారు. ఇంతలో తలుపు తెరుచుకుని పెద్దకొడుకు లోపలికొచ్చాడు, ఒక చల్లని గాలితెరగదిలోకి చొరబడుతుండగా. గుండెల్లో నుండి రక్తం కారుతున్న ఒక పెద్ద నల్లని పక్షి నొకదాన్ని అతడు చేతితోపట్టుకొచ్చాడు. నీచు వాసన వస్తున్న ఆ పక్షిని మంట ప్రక్కన పడేసి, మారు మాటలేకుండా గదిలో ఒక చీకటి మూలకెళ్ళి అతడు పడుకుని నిద్రపోయాడు.

తల్లి కథ చెప్పటం అయిపోయింది. పిల్లలంతా నిశ్శబ్దంగా పక్షి నుండి కారి గడ్డ కట్టిన రక్తం మరక వైపు ఒక సారి తేరిపారచూచి తరువాత పడకలకు ఉపక్రమించారు.

ఆరాత్రి తరువాత మళ్ళీ ఆ విషయం రాలేదు. ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు. ఇంతలో వేసవి మళ్ళీ వచ్చింది. మైదానాల్లో తుమ్మెదల రాగాలూ, వసంతపు తేలికపాటి వర్షాలవలన చిట్టడువులు వేసుకున్న మెత్తటి ఆకుపచ్చని దుస్తులూ, స్వచ్ఛమైన గాలీ తనవెంట బెట్టుకుని. అందర్లోకి చిన్నవాడు ఒక రోజు ఆరుబయట కూర్చున్న తల్లి దగ్గరకి వెళ్ళి నెమ్మదిగా మరో లోకం గురించి చెప్పమని అడిగాడు. ఆశ్చర్యంగా అతని వంక చూసిన తల్లి, ''బుజ్జీ, నేనిప్పుడాలోకం గురించి చెప్పలేను. సూర్యుడెలా వెలుగుతున్నాడో చూడు. నువ్వు మీ అన్నలతో ఆడుకోవటం లేదెందుకని?'' అని అడిగింది. అతడందరికీ దూరంగా వెళ్ళిపోయి ఒక్కడే కూర్చుని మౌనంగా ఏడ్చాడు.

అతడు తల్లిని మళ్ళీ ఆ విషయం అడుగకపోయినా, వింతగా మెరిసే కళ్ళతో అతడు రోజురోజుకీ పాలి పోసాగాడు. ఒక ఉదయం అతను మంచం మీద నుండి లేవలేక అలాగే ఉండిపోయాడు. రోజులు జరుగుతున్న కొలదీ అతడు వింత కళ్ళ చూపులతో అలాగే శూన్యంలోకి చూస్తూ మాటా పలుకూ లేకుండా కదల కుండా మంచం లోనే ఉండి పోయాడు. వాళ్ళు అతనికి ఎక్కడ బాధని అడిగి, అతడు త్వరలోనే బయట ప్రపంచంలో తిరుగుతాడనీ, కొత్తగా పూసిన పువ్వులన్నీ చూస్తాడనీ ధైర్యం చెప్పారు. అతడు వాళ్ళకి సమాధానం చెప్పకుండా, వాళ్ళనసలు చూడనట్టే పడుకుండిపోయాడు. అతణ్ణి అలా చూసిన తల్లి కళ్ళ నీళ్ళు పెట్టుకుని, తాను చూసిన అద్భుతమైన విషయాలన్నిటి గురించి చెప్పనా అనడిగితే అతడు నవ్వి ఊరుకున్నాడు.

ఒకరోజు రాత్రి అతడు కళ్ళు మూసాడు. తల్లి అతని చిన్న చేతులు మడిచి అతని గుండెలపై ఉంచగా, అందరూ అతని మంచం చుట్టూ గుమిగూడి గుసగుసలుగా సంధ్య చీకట్లో అతని గురించే మాట్లాడుకున్నారు. అతడు ఈ ప్రపంచం వదలి మరో లోకానికి వెళ్ళిపోయాడని బరువెక్కిన గుండెలతో నిట్టూరుస్తూ అన్నారు. చివరకు వాళ్ళందరూ భయంతో దిక్కుతోచక అతన్నక్కడ ఒంటరిగా చలిలో వదిలేసి వెళ్ళిపోయారు.

మరు రోజు ఉదయం అతన్ని భూమిలో పూడ్చి పెట్టారు. కమ్మటి వాసనలు వెద జల్లే పచ్చిక బయళ్ళూ, మెత్తటి వెలుగు ప్రసరించే సూర్యుడితో అంతటా మృదువైన వెలుగునిండి ఉంది. తల్లి ''అతడిప్పుడింక లేడు'' అంది. అతని సమాధి దగ్గరున్న గులాబీ పొద పువ్వులతో విరబూసింది.

అలాగే సంవత్సరాలు దొర్లిపోయాయి. తల్లి మధ్యాహ్నపు వేళలల్లో సమాధి పక్కన కూర్చుని పర్వతాల వంక చూస్తుండేది. తండ్రి ఆదారిని వెళ్ళినప్పుడల్లా సమాధి దగ్గరకు వెళ్ళేవాడు, కానీ పిల్లలెవరూ ఆచుట్టు ప్రక్కలకూడా వెళ్ళే వారు కారు. ఎందుకంటే అది భూమిపైన ఇంకెక్కడా లేని ప్రదేశం కాబట్టి.

మగపిల్లలిద్దరూ పొడవుగా ధృడంగా ఎదిగితే తల్లి దండ్రీ ముడుచుకు పోతూ వడిలి పోసాగారు. వాళ్ళ జుట్లు నెరిసి పోయి భూజాలు వంగి పోయినా, వాళ్ళల్లో ఒక లాంటి ప్రశాంతత గంభీరతా కన్పించ సాగింది. తండ్రి పిల్లలతో అప్పటికీ వేట కెళ్ళినా జంతువులు ఆవేశంగా, క్రూరంగా తిరగ బడ్డప్పుడు పిల్లలే వాటిని వేటాడేవారు. వయస్సు మీదబడిన తల్లి వాళ్ళింటికి వస్తున్న శబ్దంవిని చేతులతో తడుము కుంటూ కదిలేది. ఇప్పుడు అలసి పోయిన ఆమె కళ్ళకి మిట్టమధ్యాహ్నం ఎండలో తప్ప ఏమీ కనబడటంలేదు. మిగిలిన వేళల్లో ఆమె చుట్టూ గాఢాంధకారమే. వర్షాకాలం ఒకరోజు ఆమె ఇంట్లో గాలిసవ్వడి వింటూ పాతజ్ఞాపకాలు తలుచు కుంటూ పడుకుంది. భర్త వచ్చి ఆమె ప్రక్కన కూర్చుంటే పూర్వంలా తామిద్దరే ఆలోకంలో ఉన్నట్లు వాళ్ళు మాట్లాడుకున్నారు. శరీరం శక్తి హీనమైనా ఆమె ఆత్మలోని కాంతి ముఖం లోకి తేజస్సు తెచ్చింది. ఒక రాత్రి వాళ్ళతో ఆమె లోస్వరంతో ఇలా చెప్పింది. ''నా జీవితం గడిపిన ఈ ప్రపంచం వదిలేసి, నేనిప్పుడు నా ఇంటికి వెళ్ళిపోవాలని అనుకుంటున్నాను.'' ఆమె అలాగే వెళ్ళిపోయింది. ఆమెను వాళ్ళు నేలను తవ్వి సమాధి చేసిన చోటే ఉండిపోయిందామె.

మళ్ళీ చలికాలం వచ్చింది. ఇప్పుడు ముసలి వాడు బయట కెక్కువ వెళ్ళకుండా మంట ప్రక్కనే చలికాగుతూ కూర్చుంటున్నాడు. వేటాడిన జంతువుల్ని కొడుకులు ఇంటికి తీసుకు వచ్చి ముక్కలు కోసేవాళ్ళు. ముసలి వాడు ఆ ముక్కలు మంటపై కాలుస్తూ, ఉన్నట్టుండి పైకి లేచే మంటను చూస్తూ కూర్చునేవాడు. వసంతం రాగానే అతడు బయటకు వెళ్ళి పచ్చగా కళకళలాడుతున్న చెట్లనీ, పొలాల్నీ చూశాడు. అందర్నీ దాటుకుంటూ పలకరింపుగా తల పంకిస్తూ వెళ్ళాడు. అక్కడన్నీ అతనికి సుపరిచితమైనవే. ఆమెతో కలిసి అక్కడకు వచ్చిన మొదటి రోజు ఆమెకోసం పువ్వులు కోసిన పొద దగ్గర ఒక సారి ఆగిపోయాడు. రక్తం మరకలతో నిండిన తన ఆయుధాలు, ప్రస్తుతం తన

కొడుకులుపయోగిస్తున్న వాటి దగ్గర మరోసారి ఆగాడు. నెమ్మదిగా నడుచుకుంటూ ఇంట్లోకి వెళ్ళి మంచంపై పడుకుని, కొడుకులను పిలిచి మీరునన్ను ఆఖరి గడియల్లో చూస్తున్నారని చెప్పాడు. ''ఇన్నాళ్ళూ నేను జీవించిన ఈ లోకం వదలి వెళ్ళే సమయం వచ్చింది. మన ఇల్లిది కాదు.'' అతను ఆఖరి శ్వాస వదిలేవరకు కొడుకుల చేతుల్ని తన చేతుల్తో పట్టుకు కూర్చున్నాడు. అతని కోరిక మేరకు నేలను తవ్వి అతన్ని అందులో పూడ్చి పెట్టారు.

ముసలి వాళ్ళిద్దరూ పోగానే కొడుకులు చాలా స్వేచ్ఛ పొందినట్టు భావించారు. వాళ్ళ నిన్నాళ్ళూ కట్టేసిన తాళ్ళనెవరో తెంపేసినట్లు ఆనందించారు. మరుసటి రోజు ఉదయాన్నే వాళ్ళు ఆరుబయటకు వచ్చి పచ్చటి చెట్ల అందం, రాత్రంతా కురిసిన వర్షం వాసనా ఆస్వాదించారు. ధృడంగా పొడుగ్గా ఉన్న ఆ యువకులిద్దరూ ప్రక్క ప్రక్కన నడుస్తుంటే పుడమే వాళ్ళని చూసి గర్వంతో పొంగి పోయింది. అప్పడే వాళ్ళ జీవితం మొదలయినట్టు, వాళ్ళు ప్రపంచాన్ని తమ సొంతం చేసుకుంటానికి సిద్ధమైయ్యారు.

## జీవిత విశేషాలు :

పార్ లాజర్ క్విస్ట్ 1891లో దక్షిణ స్వీడన్‌లోని ఒక చిన్న రైతు కుటుంబంలో జన్మించారు. చిన్న వయస్సులోనే రచయిత కావాలనే నిర్ణయం తీసుకోవటం వలన ఆయన ఉప్సాలా యూనివర్శిటీలో చేరుటకు 1913లో పారిస్ వెళ్ళారు. కళల్లో ప్రాచుర్యం పొందిన ఇంప్రెషనిజము ప్రభావం అక్కడ ఆయనపై పడింది. ఈ ప్రభావం 1913లో ఆయన రాసిన 'వర్బల్ ఆర్ట్ అండ్ పిక్టోరియల్ ఆర్ట్' పై స్పష్టంగా కన్పిస్తుంది. 1930 వరకు ఆయనెక్కువగా ఫ్రాన్స్‌లోనూ, ఇటలీలోనూ జీవించారు. తిరిగి స్వీడన్‌కి వెళ్లిపోయిం తరువాత కూడా ఆయన తరచు యూరప్‌లోనూ, మెడిటేరియన్ ప్రాంతంలోనూ ప్రయాణించేవారు.

ఆయన చిన్ననాటి జీవితం గురించి 'గెస్ట్ ఆఫ్ రియాలిటీ' (1925)లోనూ, 'ది కాన్‌కరడ్ లైఫ్' (1927)లోనూ ఎక్కువగా ప్రస్తావన వస్తుంది. యుద్ధ సమయంలో ఆక్రోశం, నిరాశ 'ది ఆంగ్స్ట్' (1916)లో వ్యక్త పరచటం నుండి ఆయన కవిత్వం 1926లో రాసిన 'నాలిన్స్ ఫ్రమ్ ది హార్ట్' లో ప్రేమసందేశమే ప్రపంచాన్నంటినీ ఒక్కటిగా చేసే శక్తిగా చూపించేంతవరకు వికాసం చెందింది.

నాటక కర్తగా కూడా లాజర్ క్విస్ట్ బహుముఖ ప్రజ్ఞాశాలి. 1918లో ప్రచురించిన 'డిఫికల్ట్ అవర్' I,II,III లపై స్ట్రైన్ బర్గ్ నాటకాలప్రభావం కనపడగా, 1919లో రాసిన 'ది సీక్రెట్ ఆఫ్ హెవెన్'పై టాగోర్ ప్రభావం కన్పించగా, 1928లో రాసిన మిస్టరీ నాటకం 'హి హూ లివ్‌డ్ హిజ్ లైఫ్ ఓవర్ ఎగెన్' సహజత్వం వైపు మొగ్గుతుంది. ముప్పైలలో ఆయన రచనలలో ఎక్కువగా కన్పించేది నిరంకుశత్వంపై విపరీతమైన వ్యతిరేకత. దీనికి తార్కాణం 1933లో వచ్చిన 'హాంగ్‌మెన్' 1936లో వచ్చిన 'ద మేన్ విత్ అవుట్ ఎ సోల్,' 1939లో వచ్చిన 'విక్టరీ ఇన్ ద డార్క్‌నెస్' లలో కన్పిస్తుంది.

లాజర్ క్విస్ట్ తరువాత కాలంలో ఎక్కువగా మానవుడికి భగవంతుడితో ఉన్న బంధం గురించి రాయటం మొదలు పెట్టారు. అది ఆయన నవలలు 'ది డ్వార్ఫ్' (1944), 'బరబ్బాస్' (1950),

'సిచిల్లన్' (1956) లలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. నిజమైన నమ్మకం లేని భక్తుని కథ బరబ్బాస్ ఆయనకి మొట్టమొదటిసారిగా అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చిపెట్టింది.

1940లో లాజర్ క్వెస్ట్ స్వీడిష్ అకాడమీ సభ్యుడిగా ఎన్నికైనారు.

నోబెల్ బహుమతి స్వీకారానికి ముందు స్వీడిష్ అకాడమీ సభ్యులు, ఈనార్ లోఫ్ స్టైడ్ ఈవిధంగా అన్నారు:

సైన్సుకి కవిత్వానికి మధ్యేదైనా నిగూఢమైన సంబంధముందా? ఆంగ్ల రచయిత ఒకరు ''కవిత్వం ఒక ఆవేశభరితమైన భావవ్యక్తీకరణ, అదే సైన్సు యొక్క ముఖాకృతి కూడా'' అన్నారు. బహుశ ఈ మాటలు అన్ని శాస్త్రాలకీ వర్తిస్తాయేమో! సైన్సు, కవిత్వం రెండూ మనిషిని లౌకిక వ్యవహారాల్నుండి బయటికి లాగి మానవాళిని నిరంతరం వేధించే ప్రశ్నలకు సమాధానాలు వెదికేట్లు చేస్తాయి. ఒక సాధకుడికుండే మనో బలంతో, అత్యంత నిజాయితీతో పార్ లాజర్‌క్వెస్ట్ మానవజాతిని కుదిపివేసే సమస్యలపై వెలుగు ప్రసరించాలని ప్రయత్నించారు. పారిశ్రామిక ప్రపంచంలో, గొడ్డుపోయిన ఆధునిక నాగరికత కలిగించే ఆక్రోశానికి, పరితాపానికి కవిత్వంలో తొలిసారి రూపమిచ్చింది మీరు. మనిషి మనస్సు ఖాళీగా ఉన్న నల్లటి కారులాంటిదనీ, గాఢాంధకారంలో గుర్తు తెలియని నగరాల్లో నుండి పేరు తెలియని గమ్యం వైపు దూసుకుపోయే వాహనంలాంటిదని మీరు గుర్తించారు. కాలక్రమేణా ప్రేమ, నమ్మకాలు పోగొట్టుకోకుండా జీవించే సామాన్యుల ముఖాలపై చిరునవ్వుకూడా మీరు చూశారు. అదే గాలిలో రాత్రి వేళ తేలివచ్చే ఫ్లూట్ శబ్దం అయింది మీ **'Eternal Smile'** లో మనందరి లాంటి వాడైన, గమ్యం తెలియక, అపరాధ భావనతో క్రుంగిపోతూ, తెలియని శక్తితో నడిపిస్తుండగా మానవజాతిని రక్షించటం కోసం ప్రాణాలు కోల్పోయిన మనిషిని 'బరబ్బాస్‌లో' చూపించారు.

మేము మీకు కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలియజేస్తూ, మిగిలిన దేశాలు ఎన్నోసార్లు సిఫారసు చెయ్యగా, మీకు ఈ నోబెల్ పురస్కారాన్ని అందజేస్తున్నాము.

**బహుమతి ప్రధానము :**

1913లో 'వర్బల్ ఆర్ట్ పిక్టోరియల్ ఆర్ట్'లో అప్పట్లో అనామకుడైన లాజర్ క్వెస్ట్ ధైర్యంగా సమకాలీన సాహిత్యంలో విలువలు దిగజారి పోతున్నాయని, ఆ సాహిత్యం కళ క్రిందకే రాదని చెప్పారు. అప్పట్లో ఆయన అభిప్రాయాలు నిర్దేశిక సూత్రాలులాగ, పడికట్టు మాటలులాగా అనిపించినా, తరువాత ఆయన చేసిన రచనలు చదివింతరువాత అవే గూఢార్థాన్ని సంతరించుకున్నాయి. ''ఒక రచయత ముఖ్యమైన బాధ్యత సమకాలాన్ని కళాకారుడి దృష్టితో చూసి, తన తరం వారి కొరకు, భవిష్యత్తరాలవారి కొరకూ ఆకాలపు ఆలోచనలూ, భావాలూ వ్యక్తీకరించాలి'' అని ఆయన చిన్న వయస్సులోనే చెప్పారు. లాజర్‌క్వెస్ట్ ఆ ధ్యేయం సాధించటంలో పూర్తిగా కృతకృత్యులైనారని ఈ రోజు మనం చెప్పుకోవాలి.

ఈ రోజు మనం అంజలి ఘటించటానికి ఆయన వ్యక్తిత్వాన్నీ, ఆయన రచనలను గుర్తుకు తెచ్చుకుంటున్నాము. అతి ముఖ్యంగా మనం గుర్తు తెచ్చుకోవల్సినవీ, నిత్యం ఆయన రచనలలో జీవించే లక్షణాలు, ఆవేశంతో కూడి గమ్యంతప్పని ఆయన నిజాయితీ, అలసటెరుగని, పట్టువదలని ఆయన ఓర్పు. ఆయనలోని స్వచ్ఛమైన ఆధ్యాత్మిక లక్షణాలు నోబెల్ వీలునామాలో చెప్పిన లక్షణాలకి సరిగ్గా సరిపోతాయి. మానవ జాతిని కుదిపి వేసే విషాదకరమైన సమస్యలపై దృష్టి నిలిపి, వాటిని పరిష్కార ప్రయత్నానికి జీవితాల్ని అంకితం చేసిన కొద్ది మంది ధైర్యమున్న రచయితల్లో ఆయనొకరు. ఆయన జీవించినకాలం, ఆయన రచనల్లోని విషయాలను నిర్ణయించిన కాలం తరచు క్రమ్మేసే విపత్తుల మేఘాలతో నిండి ఉంది. అటు వంటి గాఢాంధ కారస్థితిలో ఆయనపోరాటం సాగించి, సూర్యుడులేని దేశంలో తనకు స్ఫూర్తినిచ్చే జ్వాలలను కనుక్కొన్నాడు.

విశేషమైన కల్పనాశక్తితో లాజర్‌క్వెస్ట్ సమకాలీన జీవనంలోని ఆక్రోశాన్ని నార్డిక్ సాహిత్యంలో ముందుగానే దూరదృష్టితో ఊహించి వ్యక్తపరచారు. తుఫానుల తాకిడికి మనలోని ఉత్సాహమనే హోమాన్ని ఆరిపోకుండా నిరంతరం చేతులడ్డి కాపాడిన రక్షకుడాయన. ఈ రోజు ఇక్కడున్న శ్రోతలు ఒక్కసారి ఆయన కథ ''ఓండా సాగోర్'' గుర్తుకు తెచ్చుకోండి. ఒక తండ్రి, పది ఏళ్ళ పిల్లవాడు రైలుకట్ట వెంట నడుస్తూ అడవిలో పక్షుల పాటలు వింటూ ఉదయాన వెళతారు. సాయంకాలం వారు తిరిగి వచ్చేప్పుడు ఒక మానవాతీతమైన శబ్దం గాలిని చీలుస్తూ పెద్దగా వినపడుతుంది. ''నన్ను అదేమై వుంటుందోనన్న అవ్యక్తమైన భయం ఆవరించింది. నా ప్రక్కనున్న మానాన్నకి నాభయం గురించి తెలియలేదు. నా రాబోయే జీవితం, ప్రపంచం ఎలా ఉండబోతుందో అనుభవమైంది. నా తండ్రి జీవితంలా ప్రశాంతంగా, సజావుగా నా జీవితం ఉండబోదని నాకర్థమైంది. అది నిజమైన జీవితమూ కాదూ, ప్రపంచమూ కాదు. ఏదో పెద్ద అగ్ని గుండంలాగా అది అజ్ఞాత అగాథాల్లోకి దూసుకు పోతుంది'' అని ఆ బాలుడనుకుంటాడు. ఆ చిన్నప్పటి జ్ఞాపకమే లాజర్‌క్వెస్ట్ తరువాత రచన లన్నిటిలోని విషయమని మనం అనుకోవచ్చు.

లాజర్ క్వెస్ట్ కవిత్వం, నాటకం, కావ్యం, వ్యంగ్య రచనల్లాంటి అన్ని ప్రక్రియలూ ఉపయోగించుకున్నా, వాటన్నిటిలో ఆయన జీవితాన్ని అవగాహన చేసుకున్న తీరు ఒకటే. ఆయన కొన్ని ప్రక్రియల్లో తానుకొన్నది సాధించలేకపోయినా, ఆయన ప్రతి రచనా తాను కట్టదలుచుకున్న భవనంలో ఒక రాయి వంటిదే, ఆయన కార్య సాధనలో ఒక భాగం. మహోన్నతం మరియు నికృష్టం అయిన మానవ జీవితం, బానిసల్లాగా మనుషుల్ని కట్టిపడేసే భౌతిక జీవితం, మనిషి వీరోచితంగా తన ఆత్మ స్వాతంత్ర్యం కోసం చేసే పోరాటం - మొదలైనవి ఆయన రచనల్లో ముఖ్యమైన విషయాలు ప్రతి రచనలోనూ అంతర్లీనంగా ఉండేవి. 'గెస్ట్ ఆఫ్ రియాలిటీ', 'సాంగ్స్ ఫ్రమ్‌దే హార్ట్', 'హిహూలివ్‌డ్ హిజ్‌లైఫ్ ఓవర్ ఎగెన్', 'దిడ్వార్ఫ్', 'బరబ్బాస్' ఆ కోవకే చెందుతాయి. ఆయనకు స్ఫూర్తి నిచ్చిన విషయాల విస్తృత పరిధి , ఆయన ప్రతిభ యొక్క శక్తి తెలుసుకోవటానికి వారి మిగిలిన రచనల గురించి ఇక్కడ చర్చించుకోనవసరంలేదు.

నోబెల్ స్థాపన యొక్క యాభైవ సాంవత్సరీకము రోజున ఒక విదేశీ నిపుణుడు ఇప్పటివరకు

ఇచ్చిన కొన్ని బహుమతులను విమర్శిస్తూ ఈ బహుమతి అందుకోవటానికి రెండు అర్హతలు తప్పక ఉండాలని అన్నారు. ఒకటి రచనలలో కళాత్మక విలువలు. రెండు అంతర్జాతీయ ప్రఖ్యాతి. ప్రాంతీయ భాషల్లో రాసే రచయితలకి ఈ రెండో లక్షణం ఉండటం దాదాపు అసాధ్యమే. ఏది ఏమైనా నార్డిక్ భాషలో రాసే రచయితకి అంతర్జాతీయ ఖ్యాతి ఉండటం అరుదైన సంగతి, ఈ విషయంలో న్యాయ నిర్ణయం కూడా చాలా సున్నితమైన వ్యవహారం. కాకపోతే ఈ విషయం గురించి నోబెల్ చాలా స్పష్టంగా చెప్పారు, ''జాతీయత గురించి పట్టించుకోకుండా, అర్హులైన వారికే, వారు స్కాన్‌డేవియన్లయినా కాకపోయినా, ఈ బహుమతి ఇవ్వాలి.'' అంటే దానర్థం స్వీడన్‌కు చెందినవారు బహుమతికి అర్హులైతే వారిని అడ్డుకోకూడదనే కదా! లాజర్ క్విస్ట్ చివరి రచన అంతర్జాతీయంగా అభిమానాన్ని, గౌరవాన్ని అందుకుంది. విదేశీ నిపుణులు పలుసార్లు ఆయన పేరు సిఫారుసు చేశారు. ఆయనకి బహుమతి ప్రధానం అకాడమీ సభ్యుల సిఫారుసుపైన మాత్రమే ఆధారపడి లేదు. 'బరబ్బాస్' అంతర్గత సంఘర్షణలకి లాజర్ క్విస్ట్ చెప్పిన హృదయాన్ని కదిలించే అర్థాలు మిగిలిన భాషలలో కూడా ఎన్నో భాష్యాలు చెప్పటానికి అవకాశమిచ్చి, ఈ కావ్యం యొక్క నిగూఢమైన అర్థ సాంద్రత గురించి చెబుతాయి. తేలిగ్గా అనువదించటానికి వీలులేని శైలిలో ఉన్నా ఈ కావ్యం అత్యంత శక్తి గలది. మూల భాషలో ఈ గ్రంథంలో శైలి ఒక్కోసారి సున్నితంగా ఒక్కోసారి పరుషంగా ఉన్నా స్వీడన్ దేశస్థులు ఇందులో తరుచూ సాల్మండ్ జానపద కథల, బైబిలు గాథల ప్రతిధ్వనులు వింటారు. ఇక్కడ ప్రాంతీయ ప్రత్యేకతలు విశ్వంలో అందరికీ చెందే విషయాలుగా మార్పు చెందగలవని మనం మరోసారి గుర్తుకు తెచ్చుకోవాలి.

పార్ లాజర్ క్విస్ట్ రాసిన ప్రతి పుటలోనూ ఎటువంటి భయం గొల్పే దయార్ధ్రమైన మాటలూ, అర్థాలు ఉంటాయంటే వాటి స్వచ్ఛమైన హృదయం వెనుకే ఒక భీతి కలిగించే సందేశం కూడా ఉంది. సామాన్యమైన గ్రామీణ జీవితంలో, మాటలు తక్కువగా వాడే జీవనంలో ఇవి పుట్టాయి. అతి సామాన్యమైన ఆ మాటలూ, ఆలోచనలే గొప్ప సంకల్పానికి వాహికలైనాయి. ఆ సంకల్పమేమంటే కాలానికి, ప్రపంచానికీ, మనిషి శాశ్వత స్థితికి భాష్యం చెప్పటం. అందుకే నోబెల్ బహుమతి ఆయనకిచ్చేందుకు చెప్పేకారణాల వివరణలో ఆయన రచనల స్థాయి యూరోపియన్ రచనల స్థాయిలో ఉందని చెప్పాల్సి వస్తుంది.

డా. లాజర్ క్విస్ట్ మిమ్మల్ని దగ్గరగా పరిశీలించిన మాకు మీకు జనంలోకి రావటం ఎంత అయిష్టమో తెలుసు. ప్రస్తుతానికి ఇది తప్పని సరి కనుక, ఈ పురస్కారం అందుకునే సమయంలో మీకు మా మనఃపూర్వక శుభాకాంక్షలు. అందరికంటే ఈ బహుమతి అందుకుంటానికి ఎక్కువ అర్హులైన మిమ్మల్ని సందర్భాన్ని అనుసరించి ప్రస్తుతించాల్సి వచ్చింది. ఒకవేళ సందర్భం తక్కువ గంభీరమైనదయి ఉంటే మన స్వీడన్ పూర్వ సాంప్రదాయం ప్రకారం మిమ్మల్ని సామాన్యంగా ''మీకు ఈ బహుమతి సంతోషం కలిగించుగాక'' అని మాత్రమే చెప్పి ఉండేవాడిని.

ఇప్పుడు నేను మిమ్మల్ని మన మహారాజు చేతల మీదుగా 1951 సాహిత్యానికి నోబెల్ బహుమతి స్వీకరించమని కోరుతున్నాను.

# అశ్వఘోషుడు - కాళిదాసు

**- టి. రవిచంద్**

వజ్రసూచి (స్వర్ణోత్సవ సంకలనం) ప్రూఫ్ (నకలు) చూస్తున్నప్పుడే దినపత్రికల్లో ''కాళిదాసు క్రీస్తు పూర్వం వాడే''[1]., **"Kalidas lived in first century BC?"**[2] అనే శీర్షికలతో వార్తలు వెలువడ్డాయి. అశ్వఘోషుడు, కాళిదాసుల కాలాన్ని నిర్ణయించడం సంస్కృత, సాహిత్య పరిశోధకులకు, పండితులకు దుర్లభమయింది. వీరిద్దరిలో ఎవరు ముందు, ఎవరు తర్వాతి వారు అని నిర్ణయించడం అసాధ్యమని కొంతమంది పరిశోధకులు తేల్చారు. ఏది ఏమయినా పరిశోధకుల మధ్య నిరంతరం ఈ చర్చ జరుగుతూనే ఉంది. తారీఖులు, దస్తావేజులు ఇవి కావోయ్ చరిత్ర సారమని భావించినా, కొన్ని సమయాల్లో అవే ప్రమాణమౌతున్నాయి. అందువల్ల చరిత్రలో కాలక్రమణిక **(Chronology)**కు ఉన్న ప్రాధాన్యతను అంత తేలికగా కొట్టిపారవేయలేము. ఈ పరిస్థితుల్లో నేటి దినపత్రికల్లో కాళిదాసు కాలాన్ని గురించి వచ్చిన వార్తాంశం ఆసక్తికరమైనది. మొత్తం ప్రాచీన సంస్కృత, సాహిత్య చరిత్రలో అశ్వఘోషుడు, కాళిదాసులు రెండు విభిన్న సామాజిక భావాలకు ప్రతినిధులుగానే కాకుండా గొప్ప కవితా ప్రతిభ కలిగిన సాహితీమూర్తులుగా శాశ్వత స్థానం అలంకరించారు. అందుచేత ఈ ఇద్దరు కవుల జీవితాలకి సంబంధించిన ఎటువంటి విషయం బయల్పడినా, అది ప్రపంచ దృష్టిని అమితంగా ఆకర్షిస్తుంది. అశ్వఘోషుడి కాల నిర్ణయం ఒకవిధంగా పరిష్కరించబడినట్లే. ఎటొచ్చి కాళిదాసు కాలనిర్ణయంలోనే పండితుల్లో అభిప్రాయ భేదాలున్నాయి. క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దం నుండి క్రీ.శ. పదకొండవ శతాబ్దం వరకు ఆయన జీవితకాలం గురించి చర్చ సాగుతున్నది. ఈ పరిస్థితుల్లో ఆయన జీవితకాలానికి సంబంధించి ఎటువంటి ఆధారం దొరికినా అది పరిశీలనాంశంగా మారుతుంది. అటువంటిదే నేటి దినపత్రికల్లో ''కాళిదాసు క్రీస్తు పూర్వం వాడే!'' అని ఆశ్చర్యార్థకంతో, **"Kalidas lived first century BC?"** అని ప్రశ్నార్థకంతో వెలువడిన వార్త. దీని ప్రకారం కాళిదాసు క్రీ.పూ. తొలి రెండు శతాబ్దాల మధ్యకాలానికి చెందినవాడని నిరూపించే ఆధారం మధ్యప్రదేశ్‌లోని బాన్‌పూరా సమీపములోని ఒక పురాతన గుహలో గోడలపై సంస్కృతం, ప్రాకృత భాషల్లో ఉన్న శిలాశాసనం ద్వారా వెల్లడైందని సంస్కృత, ప్రాకృత భాషల్లో పండితుడైన భగవతిలాల్ రాజ్ పురోహిత్ ప్రకటించారు. ఈ శాసనాల్ని ఆస్ట్రియా దేశానికి చెందిన పరిశోధకుడు ఎర్విన్ న్యూవేంయర్ కనుగొన్నారు. కాని ఈ శాసనాన్ని ఇంతకాలం ఎవరూ చదివి పరిష్కరించలేకపోయారు! డా॥ భగవతిలాల్ రాజ్ పురోహిత్ ఈ శాసనాన్ని చదివి అర్థం చేసుకోగలిగానని ప్రకటించారు. దీని ప్రకారం కాళిదాసు జీవితానికి సంబంధించిన మూడు విషయాలు బయల్పడ్డాయి. అవి : 1. కాళిదాసు శిబిజనపద్ సమకాలికుడు (రాజస్థాన్‌లోని చిత్తోర్ నుంచి మధ్యప్రదేశ్‌లోని బాన్‌పురా వరకు ఈ రాజ్యం విస్తరించి ఉండేది). 2. 'శ్రీ కాళిదాస్ విప్ర' (బ్రాహ్మణ) అని శాసనంలో కాళిదాసుని పేర్కొనడం వల్ల ఆయన జన్మతః బ్రాహ్మణుడని స్పష్టమౌతుంది. 3. కాళిదాసు పేరుతో 'కవిపద్ర' అనే గ్రామం ఉండటం వల్ల ఆ కాలంలోనే ఆయన ప్రసిద్ధిచెందాడని

తెలుస్తుంది. ఈ మూడు విషయాలు ప్రాచీన శిలాశాసనం ద్వారా వెల్లడవటం వల్ల అశ్వఘోషుడు, కాళిదాసుల గురించి గతంలో మేము ప్రకటించిన అభిప్రాయాన్ని పునః సమీక్షచేసుకోవాల్సిన అవసరం మాత్రం ఏర్పడలేదు. కాళిదాసు కాలానికి సంబంధించి కొంత చర్చ దీనిద్వారా జరగడానికి వీలుంది. గతంలోనే చరిత్రకారుల మధ్య కాళిదాసు కాలాన్ని గురించి మూడు బలమైన వాదాలున్నాయి - 1. కాళిదాసు క్రీ.శ. ఆరవ శతాబ్ది వాడనటం 2. కాళిదాసు గుప్తుల కాలం వాడనటం 3. కాళిదాసు విక్రమ శకారంభం (క్రీ.పూ. ప్రథమ శతాబ్ది) వాడనటం[3]. ''మహాకవి అశ్వఘోషుడు''[4] వ్యాసంలో కాళిదాసు, అశ్వఘోషుల జీవితకాలాదుల కంటే కూడా వారి భావజాలాని (Ideology) కే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాము. ప్రధానంగా వీరిద్దరిని రెండు భావజాలాలకు ప్రతినిధులుగా గుర్తించి ఆ వ్యాసం రచించడం జరిగింది. ''శ్రీ కాళిదాస విప్ర'' (బ్రాహ్మణ) అని ఈ శాసనంలో పేర్కొనడాన్ని బట్టి కాళిదాసును బ్రాహ్మణమత కవిగా మేము చిత్రించింది ఎంత యదార్థమో రుజువవుతుంది. ఆయన భావజాలరీత్యానే కాదు పుట్టుకరీత్యా కూడా బ్రాహ్మణుడు.

ఏమయినా ఈ శాసనాన్ని 1983వ సంవత్సరంలోనే ఆస్ట్రియన్ పరిశోధకుడు కనుగొన్నా, ఇప్పటివరకు అందులోని విషయం ఏమిటన్నది వెలుగుచూడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. కేవలం పత్రికల్లో వచ్చిన కథనాన్ని బట్టి శాసన విషయానికి సంబంధించి ఒక నిర్ణయానికి రావడం అంత సముచితం కాదు. శాసనానికి సంబంధించిన పూర్తి పాఠం, వివరాలు ఏదయినా పరిశోధనాపత్రం రూపంలో ప్రకటిస్తే కాని అందులోని విషయాన్ని గురించి చర్చించడానికి వీలుకాదు.

కాళిదాసుపై అశ్వఘోషుని ప్రభావం ఉందని ప్రాచ్య, పాశ్చాత్య పరిశోధకుల్లో ఎక్కువమంది భావిస్తున్నారు. ఆ పరిశోధనల ఆధారంతోనే మేము కూడా కాళిదాసుపై అశ్వఘోషుని ప్రభావం కవితాపరంగా ఉందని చెప్పాం. చారిత్రక విషయాలపై నిరంతరం పరిశోధన జరుగుతుంటుంది. కొత్త విషయాలు బయల్పడుతుంటాయి. కొత్త పరిశోధనా ఫలితాల వెలుగులో పాత భావాల్లో మార్పులు, చేర్పులు అనివార్య మౌతాయి. ఈ మార్పులు, ఆయా వ్యక్తుల జీవితకాలాదులకు సంబంధించినవే కాని భావజాలాలకు సంబంధించి ఉండవు. ఎందుకంటే ఎవరు ఏ భావజాలానికి ప్రతినిధులు అని నిర్ణయించేది ఆయా రచయితల రచనలేకాని వారి పుట్టు పూర్వోత్తరాలు కాదు. ఈ విషయాన్ని విమర్శకులు, విమర్శకుల పేరుతో చలామణి అవుతున్న రంధ్రాన్వేషకులు గుర్తించాలి. లేకపోతే అనవసరమైన చర్చలతో కాలహరణం జరుగుతుంది. అశ్వఘోష, కాళిదాసుల్లో ఎవరు, ఎవరి నుండి స్ఫూర్తి పొందారనే విషయం సందేహాతీతంగా నిరూపించడం ఈ భూమ్మీద ఏ శక్తికీ సాధ్యం కాదని ''కాళిదాస''[5] జీవిత చరిత్రకారుడు కేరళపుర కృష్ణమూర్తి అన్నారు. అందువల్ల ఈ విషయంలో వివాదాస్పదం కాని చారిత్రకాధారం దొరికే వరకు విజ్ఞులైన అధిక సంఖ్యాక పరిశోధకుల అభిప్రాయాన్ని గౌరవిస్తూ ముందుకుపోవడమే మనం చేయగలిగింది.

సంస్కృత సాహిత్యంలో కవిగా, మానవతావాదిగా అశ్వఘోషుడికి రావాల్సినంత కీర్తి రాకపోవడానికి ప్రధాన కారణం - బ్రాహ్మణమతం. దానితోపాటు ఈ దేశంలోని వామపక్ష ఉద్యమాన్ని మరొక

కారణంగా పేర్కొనాలి. వామపక్ష ఉద్యమంలో మహాపండిట్ రాహుల్ సాంకృత్యాయన్, డా॥కె. బి. కృష్ణ లాంటి కొంతమంది స్వతంత్ర మేధావులు తప్ప, మిగతా ఉద్యమం అంతా కాళిదాస భజనలోనే సామాజికస్పృహను నీరుగార్చిందనడానికి ప్రత్యక్షతార్కాణమే. 1956వ సంవత్సరంలో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం, విజయవాడ వారు ప్రచురించిన ''అభ్యుదయ కాళిదాస ప్రత్యేక సంచిక''[6]. ఈ సంచికను కాళిదాస జయంతి సందర్భంగా ప్రచురించారు. కాళిదాస సామాజిక తత్త్వాన్ని గురించి ఏమాత్రం అవగాహన లేకుండా తుమ్మల వెంకట రామయ్య సంపాదకీయం రాశారు. ఆయన మాటల్లోనే చూడండి:

''కవికుల గురువు, మహాకవి కాళిదాస జయంతి సంచికగా 'అభ్యుదయ'ను సమర్పించుతున్నాం. భారతీయ సంస్కృతీ చరిత్రలో ఉజ్వలతారలుగా వెలుగొందిన వ్యాస వాల్మీకుల తర్వాత కాళిదాసే అనవచ్చు. ఒక జాతి మహోన్నత దశకు ప్రతి బింబంగా జాతీయ మహాకవిని పేర్కొనవలసినప్పుడు, కాళిదాసు కన్న అర్హుడు మరొకడు లేడేమో! భారతీయ సంస్కృతీ చరిత్రలోనేగాక విశ్వసాహిత్యంలోనే ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకొన్న మహాకవి కాళిదాసు. దేశకాలాల ఎల్లలకు అతీతుడై శతాబ్దాల తరబడి తన కవితా యశశ్చంద్రికలు విరజిమ్ముతున్న మహాకవి కాళిదాస కవితాప్రాగల్భ్యాన్ని పఠితల కందీయడానికి మేము చేసిన ఈ స్వల్ప ప్రయత్నాన్ని పాఠకలోకం ఆదరించుతుందని ఆశిస్తున్నాం!'' ఇదీ కాళిదాసు పట్ల నాటి కమ్యూనిస్టు అభ్యుదయ రచయితల వైఖరి. ఈ సంచికలోని వ్యాస రచయితలందరూ కాళిదాసుని సాంప్రదాయదృష్టితో పరిశీలించినవారే! వ్యాసకర్తలందరిదీ ఒకే మాట, ఒకే పాట - ''భారతదేశ కవులందరిలోనూ, నాటకకర్త లందరిలోనూ ఆయన అగ్రగణ్యుడని సర్వులు ఆమోదించినారు. అతని కృతులు సమస్త కాలాలలోనూ అశేష ప్రజాభిమానాన్ని, వున్నత ప్రతిష్ఠనూ ఆర్జించుకొన్నవి.'' ఈ సంచిక ద్వారా పాఠకులకు అభ్యుదయ రచయితల సంఘం ఏమి చెప్పదలుచుకున్నదో బోధపడదు.

''కాళిదాసు రాజకీయ తత్త్వం'' అనే వ్యాసాన్ని రచించిన కారుమంచి తమ వ్యాసంలో చిత్రవిచిత్ర సూత్రీకరణలు చేశారు. అంతేకాదు. ఆయన దృష్టిలో కాళిదాసు విప్లవవాది! ఆయన విప్లవవాది ఎలాగయ్యాడయ్యా అంటే శ్రీ కారుమంచి హరికథా కాలక్షేపం ఇలా ప్రారంభించారు - ''యుద్ధ వ్యతిరేకత, జీవహింసలను ప్రబోధించి, కత్తిపుష్టిని చంపి, శృంగార విముఖతతో వైరాగ్య ప్రవృత్తిని పురిగొల్పుతున్న బౌద్ధముతో సంఘం సతమతమవుతున్న కాలం. ఈ కాలంలో కేంద్రీకృత రాజరికమును, సాంఖ్య వాదమును స్వీకరించి విజయమును సాధించినవాడు కాళిదాసు.

''తాను మాత్రం తన కాలంలో వేళ్ళూనిన వైరాగ్య బోధల వల్ల పాతుకుపోయిన శృంగార విముఖత్వాన్ని పెకలించడానికిగొడ్డలిపెట్టుగా తనకార్యసాధనకోసరం ఈ కావ్యాన్ని ( ఋతుసంహారం) రచించాడు మహాకవి.

''సంస్కృత సాహిత్యమందు విశ్వశ్రేయోభిదాయకమైన నూతన రాజకీయవములను, వేదాంతమును, సాహిత్యరీతులను స్వీకరించినాడు.

''బౌద్ధములోని యుద్ధ వ్యతిరేకతతో కత్తిపుష్టి చచ్చి పరాయి దండయాత్రలను తట్టుకోలేక సతమతమగుచున్న భారతజాతికి విప్లవకరమైన కేంద్రీకృత రాజరిక సిద్ధాంతమును రాజకీయములందు ప్రతిపాదించి విప్లవాదియైనాడు.'' ఆలోచనాపరులైన నేటి పాఠకులకు ఈ హరికథను వివరించాల్సిన అవసరం లేదనుకొంటున్నాము. నాటి కమ్యూనిస్టుల ''అభ్యుదయ'' పత్రిక బ్రాహ్మణమత కవి కాళిదాసులో అభ్యుదయ వాదిని, విప్లవవాదిని కూడా దర్శించుకోగలిగింది! మరి నేటి అభ్యుదయ కవి ఆవంత్స సోమసుందర్ కవికులపతి కాళిదాసుని కవితా వైభవాన్ని రసజ్ఞులైన పాఠకులకు ఆత్మీయంగా అందించాలని మరో హరికథ ''కాళిదాసు రామకథ''[7] (రఘువంశం)ను 1999వ సంవత్సరంలో రచించారు. దీని ద్వారా ఆయన రసజ్ఞులైన పాఠకులకు, సాధారణ పాఠకులకు ఏ సామాజిక సందేశాన్ని అందించ దలుచుకున్నారో అర్థంకాదు.

''కాళిదాసు రామకథ''లో సోమసుందర్ పంచమదశ సర్గలో శంబూక వధను అనువదిస్తూ ఎలా స్పందించారోనని ఆ సర్గను ఎంతో ఆసక్తితో చదవడానికి ప్రయత్నిస్తే తీవ్ర నిరాశే ఎదురయింది. అయితే ఈ సర్గను అనువదించేటప్పుడు సోమసుందర్‌కు ఒక సంశయం కలిగింది. ఆశ్చర్యమే. ఇంతకీ ఈ సంశయం ఏమిటంటే ''మను ధర్మశాస్త్రం కాళిదాసు కాలానికి వచ్చింది సరే - కానీ, కృతయుగంలో రాముని కాలానికి రాలేదు కదా? అప్పుడు మను ధర్మశాస్త్ర ప్రమాణంతో రాముడు శంబూకవధ చేయడంలో ధర్మమేమిటి?'' ఎంత గొప్ప సంశయం![8] కాళిదాసు మనుధర్మశాస్త్ర ప్రమాణంతో కాకుండా కృతయుగానికి చెందిన మరో ధర్మశాస్త్ర ప్రమాణంతో ''శంబూకవధ'' జరిగినట్లు చిత్రిస్తే సశాస్త్రీయంగా ఉండేదేమో! ఈ అభ్యుదయ కవికి కాళిదాసు కవితా వైభవంతో తప్ప, ఆయన సామాజిక దృష్టితో సంబంధం లేదు. శంబూకవధను అనువదించేటప్పుడు సోమసుందర్‌లో ఏమాత్రం బాధ కనిపించదు. కనీసం ఆ సంఘటన పట్ల ఎక్కడా నిరసన ధ్వనీ వినిపించదు. తన సొంత అభిప్రాయం కనిపించదు.

ఈ అభ్యుదయవాది కంటే రఘువంశాన్ని సంస్కృతం నుండి ఆంగ్లంలోకి అనువాదం చేసిన సి.ఆర్. దేవధర్ అనే సాంప్రదాయ పండితుడు శంబూకవధను అనువదించేటప్పుడు ఎంతో అభ్యుదయాన్ని ప్రదర్శించాడు. ''శంబూకవధ ధర్మకార్యమేనని దేవర్షి అభినందించాడ''ని సోమసుందర్ ఆనందించాడు. కాని సాంప్రదాయ పండితుడైన దేవధర్ ఏమంటున్నారో చూడండి - **"The penalty of death inflicted on Sambuka for the transgressor of caste-rules was not justifiable on any grounds. If the rules could be relaxed for other castes, why not for Sudra?"**[9]. వర్ణధర్మాన్ని అతిక్రమించిన శంబుకుడికి విధించిన మరణదండన ఏ ప్రమాణాలతో నయినా న్యాయసమ్మతం కాదు; సమర్థనీయం కాదన్నాడు దేవధర్. ఇటువంటి ఒక్క వాక్యాన్ని కూడా సోమసుందర్ వ్యక్తీకరించలేకపోయాడు. రాముడు శంబుకుణ్ణి వధించిన వెంటనే విప్రకుమారుడు నిద్ర నుంచి లేచిన వానివలె లేచి నిలబడ్డాడని సోమసుందర్ మామూలుగా అనువదించాడు. దేవధర్‌కు మాత్రం శంబుకుణ్ణి రాముడు వధించిన వెంటనే బ్రాహ్మణ బాలుడు మరల బ్రతకడం వింతగానూ, ఆశ్చర్యంగానూ తోచింది. ఆయన సాంప్రదాయవాదయినా ఆయనలో

మానవస్పృహ నశించలేదు. అభ్యుదయవాదుల ఆర్థికదృష్టి వల్ల సహజంగా సాధారణ మానవుల్లో కనిపించే మానవాంశ సయితం అదృశ్యమయింది.

ఈ దేశంలోని అభ్యుదయవాదుల్లో బ్రాహ్మణమత ధర్మాలను తన రచనల్లో ఆదర్శీకరించిన కాళిదాసుపై ఉన్న ఆసక్తి, అభిమానం ఆ తప్పుడు ఆదర్శాలను తన రచనల ద్వారా తీవ్రంగా నిరసించి, ప్రత్యామ్నాయ మానవ సంస్కృతి రూపొందించిన మహాకవి అశ్వఘోషుడిపై ఏర్పడలేదంటే వారు పుట్టిపెరిగిన సామాజిక వాతావరణాన్ని అధిగమించ లేకపోయారనే భావించాలి. 1956వ సంవత్సరంలో వెలువడిన ''అభ్యుదయ కాళిదాస సంచిక'' నుండి 1999వ సంవత్సరంలో ప్రముఖ అభ్యుదయ సాహితీవేత్త ఆవంత్స సోమసుందర్ ''కాళిదాస రామకథ'' పేరుతో రచించిన అనువాద గ్రంథం వరకు వచ్చిన సాహిత్యాన్ని పరిశీలిస్తే వీరి సామాజిక దృష్టి చాలా సంకుచితమైందిగా స్పష్టమౌతుంది. కుల సమస్య విషయంలో వీరికి ఏమాత్రం చారిత్రక అవగాహన లేదనేది కాళిదాస రచనల పరిశీలనలోనే అర్థమౌతుంది. తొలి మార్క్సిస్టు పరిశోధకుడు డా॥ కె. బి. కృష్ణ 1932వ సంవత్సరంలోనే కులవ్యతిరేక ప్రతిఘటనోద్యమాల అధ్యయనం ప్రారంభిస్తే, నేటికీ ఆయన ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా గుర్తించిన ఒక్క వామపక్ష సంఘం లేదంటే, వీరంతా ఆర్థికవాదం ఊబిలో ఎంతగా కూరుకుపోయారో చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన మహాకవి అశ్వఘోషుణ్ణి, ఆయన సామాజిక విప్లవ భావాల్ని తన రచనల్లో ఎంతో గొప్పగా చిత్రించాడు. కమ్యూనిస్టులంతా అభిమానించే రాహుల్ సాంకృత్యాయన్ తన రచనల్లో కాళిదాసు రాచరికాన్ని, వర్ణ ధర్మాన్ని ఎంతగా సమర్థించిందీ కళ్ళకు కట్టినట్టు చిత్రించాడే. రాహుల్జీ రచనల్ని కూడా అభ్యుదయవాదులు మరిచిపోయారా? రాజకీయంగా విప్లవ నినాదాలు చేసే అభ్యుదయవాదుల్ని సామాజికంగా యథాతథవాదులుగా పరిగణించక తప్పదు. ఎవరు గుర్తించినా, గుర్తించకపోయినా భారతీయ సంస్కృతీ సాహిత్య చరిత్రలో మహాకవి అశ్వఘోషుడు కవిగా ఎంత గొప్పవాడో, మానవతా విలువల సమర్థనలో అంతకంటే గొప్పవాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. వస్తువుకి, రూపానికి ఉన్న గతితార్కిక సంబంధాన్ని గురించి ప్రసంగించే అభ్యుదయవాదులకు అశ్వఘోషుడు తన సాహిత్య సృజనలో ఈ రెండింటికిచ్చిన సమ ప్రాధాన్యతను గుర్తించలేకపోయారు. కాళిదాసుని కవితావైభవం పేరుతో గతితర్కంలోని గతి (మార్పు) ని, తర్కం (వివేచన) ను కోల్పోయారు అభ్యుదయవాదులు!

## సంప్రదించిన రచనలు :


1. కాళిదాసు క్రీస్తుపూర్వం వాడే!, వార్త, తెలుగు దినపత్రిక, హైదరాబాద్, నవంబరు 10, 1999.
2. **Kalidas lived in first century BC?, The Hindu, National Daily, Hyderabad, November 10, 1999,** పేజీ **10.**
3. సంస్కృత సాహిత్య చరిత్ర, రచయితలు : ముదిగంటి గోపాలరెడ్డి, ముదిగంటి సుజాతారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1986; **Kalidasa, K. Krishnamoorthy, Sahitya Akademi, Delhi, 1994.**

4. మహాకవి అశ్వఘోషుడు (పరిచయ వ్యాసం), టి. రవిచంద్, మహాకవి అశ్వఘోషుని వజ్రసూచి, సంస్కృతం నుండి తెలుగు అనువాదం : డా॥ మలయశ్రీ, మిళింద ప్రచురణలు, గుంటూరు, 1995, పేజీలు : I-XXII.

5. Kalidasa, K. Krishnamoorthy, Sahity Akademi, Delhi, 1994.

6. అభ్యుదయ (కాళిదాస సంచిక), ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం, విజయవాడ, అక్టోబరు 1956 ( ఈ సంచికను ప్రత్యేకంగా జిరాక్స్ చేయించి పంపిన సాహితీ మిత్రులు రావెల సోమయ్యగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను).

7. కాళిదాసు రామకథ, డ్యాక్టర్ ఆవంత్స సోమసుందర్, కళాకేళి ప్రచురణలు, పిఠాపురం, ఆగష్టు 1999.

8. Sudras in Ancient India, R.S. Sharma, Motilal Banarsidass, Delhi, 1990, పేజీ 301. రామాయణంలో రాముడి చేతిలో శంబూకుడు మరణించాడన్న కథ బహుశః మౌర్యయుగానంతరం రామాయణంలోని ఉత్తరకాండ (అధ్యాయాలు 74-76)లో చొప్పించబడి ఉండవచ్చని ఆర్. ఎస్. శర్మ ఈ గ్రంథంలో అభిప్రాయపడ్డారు. శంబూకవధ మూల రామాయణంలో నిజంగా ఉందా లేక తర్వాత చేర్చబడిందా అనేది మనకు అప్రస్తుతాంశం. ఎందుకంటే కాళిదాసు కాలానికే అది రామాయణంలో భాగమయింది. శంబూకవధను కాళిదాసు సమర్థించాడు. అంతేకాదు. శంబూకుడు తపస్సు వల్ల కూడా పొందలేని మోక్షాన్ని రాముని చేతిలో మరణించడం వల్ల అతడు పొందగలిగాడని ''అభ్యుదయకవి'' కాళిదాసు అభిప్రాయపడ్డాడు! శంబూకవధ తర్వాత కాలంలో రామాయణంలో చొప్పించబడి ఉంచవచ్చునని ఆర్. ఎస్. శర్మ ఆంగ్లమూలం (పాదపీఠిక 2, పేజీ 301)లో చెప్పారు. దీన్ని సనారం నాగభూషణం తెలుగు అనువాదంలో తొలిగించారు.

9. Raghuvamsa of kalidasa, Edited by C.R. Devadhar, Motilal Banarsidass, Delhi, Reprint : 1993.

*Continuation from page no. 2*

అంకెలలో 'సున్న' (0) అసలు లేనే లేదు. మొదట్లో తొమ్మిది అంకెల వరకే ఉండేవి. ఆ తరవాత చాలకాలం తరవాత, భారతీయులు సున్నను ప్రవేశపెట్టారు. సున్నకు స్థిర విలువలేదు. దాని స్థానాన్ని బట్టి ఇతర అంకెల విలువ మారుతుంది. ఇటువంటి స్థిర విలువ లేని 'సున్న' ఆధారంగా ముహూర్తాలు పెట్టడం ఎంతవరకు సబబు. తిధి , వార, నక్షత్రాల ఆధారంగా శుభలగ్నాలను నిర్ణయించేవారికి 'సున్న' లతో పని ఏమిటి?

ఒక ప్రక్క ఆధునిక విజ్ఞాన ఫలితాలను అనుభవిస్తూనే, దాని పరంగా ఆలోచించకుండా, గొర్రెదాటులో నడవడం సుఖకరమేమో. ఆలోచించడం శ్రమతో కూడింది. ఆలోచించకపోవడం సుఖమేమో!

# జ్ఞానవికాసంలో తర్కం పరిధి

## (తత్వశాస్త్రం)

(అక్టోబర్ - 1999 సంచిక తరువాయి)

**- బి. ఎస్. రాములు**

ఈ కులం నాది, ఆ కులం నాదికాదు, ఈ మతం నాది, ఆ మతం మనది కాదు అనే ఆలోచన వల్లనే పొరుగునే సహజీవనం చేస్తున్నప్పటికీ అతని కులం నీకులం కాదని, నీకులానికి సంబంధించిన సంస్కృతి, సాంఘిక హోదా వ్యక్తిత్వ నిర్మాణాన్ని సొంతం చేసుకోవడం జరుగుతున్నది. నేను స్త్రీని నేను మగవాన్ని కాదు అనుకోవడం నుంచి ఒకే యింట్లో, మగవాళ్ళున్నప్పటికి వాళ్ళ హావభావాల్ని, భాషను, అలవాట్లను అనుకరించకుండా స్త్రీలనే అనుకరించి స్త్రీలుగా మారడం మొదలవుతుంది. అలాగే నేను మగవాన్ని స్త్రీని కాదు అనుకోవడం నుంచి ఒకే యింట్లో తల్లి, అక్క, చెల్లి వంటి స్త్రీలున్నప్పటికి వారిని అనుకరించకుండా మగవాళ్ళను అనుకరించడం ద్వారా మగవాళ్ళుగా మారుతారు. ఇలా మారడమే సహజం అనుకోవడం సమాజం యిలానే కొనసాగాలి అనుకోవడానికి సంబంధించిన చైతన్యమే తప్ప సహజంగా అబ్బేది కాదు. ఏదీ సహజంగా (పుట్టుకతో) అబ్బదు. పెపకంతో, ఇదినాది, అదినాది కాదు అనే మనస్సును అనుసరించి, ఆలోచనను అనుసరించి ''సహజం'' లాగా అభ్యాసమౌతుంది.

ఆకలి తీరడం మనిషి ప్రాథమిక అవసరం. ఆకలి తీరిన తర్వాత జీవించే జీవితం అదనపు జీవితం. ఆకలి తీర్చుకోవడం కోసమే జీవించడం జంతువు స్థాయి జీవితం. ఆకలి తీరన తర్వాత జీవించే అదనపు జీవితాన్ని, సుఖాలు అని, భోగభాగ్యాలు, పరోపకారం అని వర్గీకరిస్తారు. ఆకలి తీర్చుకునే క్రమం నుంచి మానవ నాగరికత పుట్టుక మొదలైంది. ఏది దొరుకుతుందో, ఏది అరుగుతుందో, ఏది అరుగక, ఏది విషంగా శరీరానికి నష్టం చేస్తుందో గ్రహించి వాటిని వదిలేస్తూ రావడం ద్వారా ఆహారపు అలవాట్లు రూపొందాయి.

మనిషికి అష్టాంగాల ద్వారా, అష్టేంద్రియాల ద్వారా జ్ఞానం అందుతుంది. అవి కన్ను, చెవి, ముక్కు, నోరు, చర్మం, కాళ్ళు, చేతులు, మర్మావయవాలు. తెలియని విషయాలను తెల్సుకోవడం జ్ఞానం. కంటితో చూసి, చెవితో విని, చర్మంతో స్పర్శించి, నాలుకతో రుచి చూసి, ముక్కుతో వాసన చూసి అవయవాలతో, నరాల స్పందనతో గ్రహించి విషయాలను తెల్సుకొంటాము. నాలుక ముక్కులాగే కాళ్ళు, చేతులు, మర్మావయవాలు వాటికి ప్రత్యేకించిన పనులు చేస్తాయి. చేతి వృత్తులు, హస్తకళలు, డప్పు, వీణ, టైపు, చిత్రలేఖనం, లిపి మొదలైన వాటితో చేతులు ప్రత్యేకమైననైపుణ్యంతో పనిచేస్తాయి. మానవ సమాజంలో కాళ్లు, చేతులు, మర్మావాయవాలు నిర్వహించే పాత్ర అమోఘమైనది. అందువల్ల పంచేంద్రియాలు అని చెప్పడం కన్నా అష్టేంద్రియాలు అని చెప్పడం సముచితం. ఈ ఎనిమిది ఇంద్రియాల ద్వారా మనిషి తన వెలుపలి ప్రపంచాన్ని తెల్సుకొంటాడు. ఈ ఎనిమిది ఇంద్రియాల ద్వారా మనిషి ప్రకృతి, సమాజాలతో సంబంధంలోకి వస్తాడు. వీటి ద్వారా స్వయంగా తెల్సుకునేది ప్రత్యక్ష జ్ఞానం. మిగతాది పరోక్ష జ్ఞానం. పరోక్ష జ్ఞానం అంటే యితరులు స్వయంగా ప్రత్యక్షంగా తెల్సుకొన్న వాటి నుండి రూపొందిన జ్ఞానం. మనకు ప్రత్యక్ష అనుభవం లేకపోయినా పొందగలిగేదంతా పరోక్ష జ్ఞానం, స్కూల్లు, కాలేజిలు, శిక్షణా తరగతులు, శిక్షణ, సాధన, పాఠ్యపుస్తకాలు, గ్రంథాలు,

పద్ధతులు, కథలు, కళలు మొదలైనవన్ని మానవ సమాజం యింతదాకా సాధించిన జ్ఞానాన్ని 'పరోక్ష జ్ఞానం'గా పొందడానికి రూపొందించుకున్న వ్యవస్థలు, పద్ధతులు అని పైన చూసాము.

ఆచరణ నుంచి పుట్టిన భావాలు, జ్ఞానం, అనుభూతులు చాలా కాలం కొనసాగుతాయి. ఒక ఆచరణ నశించినప్పటికీ దాన్నించి పుట్టిన భావాలు, జ్ఞానం, అనుభూతులు నశించకపోవచ్చు. అవి చాలాకాలం కొనసాగవచ్చు. అందువల్ల ఆచరణకన్నా దాన్నించి పుట్టిన భావాలు, జ్ఞానం, అనుభూతుల జీవితకాలం ఎక్కువ. పాత ఆచరణ తాలూకు భావాలు, జ్ఞానం ఆచరణ లేకుండానే తెలుసుకునే అవకాశం ఉంది. ఈ కోణంలో ఆచరణకన్నా దాన్నించి పుట్టిన భావాలు, జ్ఞానం ఉన్నతమైనవి. ఆచరణ లేకుండా భావాలు లేనప్పటికీ ఆచరణ లేకుండా భావాలు, జ్ఞానం కొనసాగడం సాధ్యపడడంవల్ల భావాలకు, జ్ఞానానికి ప్రాధాన్యత ఏర్పడింది. అందువల్ల భావాలపై, జ్ఞానంపై హక్కు సాధించినవారికి సమాజంపై హక్కు, అధికారం, గౌరవం పెరిగాయి. తర్కశాస్త్రం ప్రాధాన్యత అలా రూపు దిద్దుకుంది.

ఆటవిక దశలో రూపొందించుకున్న తార్కిక ప్రమాణాలు, చర్చలు తర్కశాస్త్రంలో కనపడతాయి. నేను ఓడిపోతే నీకు శిష్యున్ని అవుతాను. నీవు ఓడిపోతే నాకు శిష్యరికం చేయాలి అని తర్కవాదులు షరతు విధించుకునేవారు. ఇది వర్గపోరాటాల, ఆటవిక సమాజాల రాజనీతి సూత్రం. దీన్నించి సమాజం ఎదిగింది. అభిప్రాయాలు ఖండించబడినప్పటికీ తన అభిప్రాయాలు తాను కలిగి ఉండే హక్కు ఏర్పడింది. మన అభిప్రాయాలు మారుతాయి. ఉదా॥కు ఒకసారి ఓడించిన పార్టీనే మనం తిరిగి గెలిపిస్తుంటాము. అందువల్ల ఎదుటివారు భిన్నాభిప్రాయాలు కలిగి ఉండే హక్కును, దాన్ని వ్యక్తీకరించే హక్కును, గౌరవించే ప్రజాస్వామిక సమాజానికి మానవ సమాజం ఎదుగుతోంది. ప్రతి మనిషికి ఒకే విలువ, ఒకే ఓటు అనే భావన మనుషులందరినీ సమానం చేసి చూడ్డం నుండి ఉత్పన్నమయింది. దీన్ని తర్కశాస్త్రాలు, వాటి చర్చా నిర్మాణ పద్ధతులు అంగీకరించవు. తర్కశాస్త్రాలు ఈ విషయంలో గిడసబారిపోయాయి. ఏమంటేవాటి నిర్మాణ పద్ధతిలో, చర్చా పద్ధతిలో ఇద్దరిలో ఒకరే కరెక్టు అనే వర్గవిభజన, కించపరచడం, నిరాకరించడం ఉంది. అందువల్ల ప్రపంచంలో ఇటీవల దీన్ని అధిగమించి ప్రతిదానికి ఎస్ ఆర్ నో అనే జవాబుకు బదులుగా ఎస్ అండ్ నో అనే జవాబు పుట్టింది.

చాలా తత్వశాస్త్రాలు, తర్కశాస్త్రాలు ప్రతిమనిషికి ఒకే విలువ, ఒకే ఓటు అనే తత్వాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేవు. దీన్ని అంగీకరిస్తే ఆ శాస్త్రాలు ఆ శాస్త్రాలుగా ఉనికిని కోల్పోతాయి. ఎందువల్లనంటే తత్వశాస్త్రం ఆలోచనను, తర్కశాస్త్రం చర్చను ప్రాథమికం చేస్తుంది. ప్రతి మనిషికి ఒకే విలువ, ఒకే ఓటు అనే సూత్రీకరణ ఆలోచనను కాకుండా మనిషి ఆచరణను, మనిషిని, మనిషి విలువను ప్రాథమికం చేస్తుంది. భావంతో పాటు మనిషిని ప్రాథమికం చేయడం ప్రతి మనిషికి ఒకే విలువ; ఒకే ఓటు అనే తత్వంలో ఉంది. మనిషి కోసమే మనిషి ఆచరణలో భాగంగా పుట్టిన భావాల ద్వారా కొందరు మనిషిపై చేసే పెత్తనానికి ఒక అడ్డూ అదుపు ఉంచి తిరిగి మనిషిని, సమాజాన్ని ఉన్నతంగా నిలబెట్టే ప్రజాస్వామ్య తత్వం ఎదుగుతున్నది. ఇలా వేల ఏళ్ళ తర్వాత తత్వశాస్త్రంలో, తర్కశాస్త్రంలో భావాలు, చర్చలు, తర్కబోధకులు, ప్రమాణ వివేచనలు వాటి అధిపతులు ఆక్రమించిన స్థానాన్ని తిరిగి మనిషి, సమాజం ఆక్రమించేదిగా సమాజం పరిణతి చెందుతున్నది.

జ్ఞానం కొందరి వ్యక్తిగత ఆస్తిగా మారుతూ సమాజం నుండి పొంది సమాజాన్నే శాసించేదిగా ఒక రాజ్యంగా పరాయీకరణగా ఉనికిని ప్రారంభించినప్పటి నుండి ప్రజలు ఈ జ్ఞానులకు బలి అవుతూనే ఉన్నారు. ఏమంటే ఎక్కువ తెలిసినవాడే ఎక్కువ మోసం చేయగలడు. ప్రజలు మానవులుగా జ్ఞానులందరితో సమానంగా జీవించే హక్కుతో బతికే రాజ్యాంగబద్ధ హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఏర్పడింది. ఇది విశ్వమానవాళి వేల ఏళ్ళ కృషి పరిణామంలో సాధించుకున్న ఫలం. తత్వశాస్త్రాలు కొన్ని వర్గాల, గ్రూపుల, మతాల, దృక్పథాల వ్యక్తిగత ఆస్తిగా కొనసాగే మేరకు అవి మొత్తం మానవాళి సాధించిన ఫలాలకు వెనకబడిపోతున్నాయి.

జ్ఞానం కొందరి వ్యక్తిగత ఆస్తిగా, ''రాజ్యం''గా మారడంతో పాటు మానవ సమాజ ఆచరణలో భాగంగా సైన్సు సమాజ శాస్త్రాలు, కళలు అభివృద్ధి చెందాయి. ప్రకృతి శాస్త్రాల అభివృద్ధి క్రమాన్ని అనుసరించి సమాజ శాస్త్రాలు పరిణామం చెందుతూ వచ్చాయి. సమాజ శాస్త్రాలు సైన్సు అభివృద్ధికి, అడ్డంకికి రెంటికీ తోడ్పడ్డాయి. తత్వశాస్త్రాల, తర్కశాస్త్రాల కేవలచర్చ సైన్సును, ఆచరణను అప్రధానం చేస్తూ అడ్డగిస్తాయి. వాద ప్రతివాదాల్లో దేన్నో ఒకదాన్ని సమర్థించాలి అనే అర్థం తర్కశాస్త్రాల్లో ఇమిడి ఉన్నది. దీని వల్ల ఇరు పక్షాల్లో ఎవరో ఒకరిని గెలిపించడండి అనే భావం కొనసాగుతుంది. సైన్సు రీత్యా వాళ్ళిద్దరి వాదాలు పైన చేసిన సూర్యుని చర్చలో లాగాతప్పు కావచ్చు. ఇలాంటి వాద ప్రతివాదాల తర్క శాస్త్ర చర్చా పద్ధతి వల్ల మానవ సమాజం జ్ఞానం ఆచరణ ఆ ఇద్దరిలో ఎవరో ఒకరికి ఓటేసే ఓటర్లుగా మిగిలి పోవాల్సి వస్తుంది. తద్వారా ఈ రెండు పక్షాల్లో దేనికో ఒకదానికి అనుకూలంగా ఉండేది మాత్రమే తర్క బద్ధంగా ప్రకరణ సహితంగా కనపడి కొత్తది లేదా వారిద్దరిని వ్యతిరేకించే వివేచన ప్రకరణ భంగంగా తర్క భంగంగా, టెక్ భంగంగా, నిర్మాణ భంగంగా, ప్రజా ద్రోహంగా వారికి కనపడుతుంది. సత్యం అసత్యంగా నిరూపించబడుతుంది. కొత్తది నిరాకరించబడుతుంది.

అందువల్ల వీళ్ళిద్దరిని వ్యతిరేకించే వారిని వాళ్ళిద్దరు ఒకటై కలిసి ఓడించే ప్రయత్నం చేస్తారు. పాండవులు కౌరవులు రెండు పక్షాలుగా మారి మొత్తం గిరిజన తెగల్ని, రాజ్యాల్ని తమ సామ్రాజ్యంలో కలుపుకున్నారు. భారత యుద్ధంలో పాండవులు గెలిచినా, కౌరవులు గెలిచినా ఆ గిరిజన తెగలు, రాజ్యాలు సామంత ప్రజల్లాగే కొనసాగుతారు. అక్బరు, రాణాప్రతాప్‌ల యుద్ధంలో ఎవరు గెలిచినా మిగతా ప్రజలు వారి పాలితులే అవుతారు. అలాగే మాదే గొప్ప పోరాటం, మాదే గొప్ప భావజాలం, మాదే గొప్ప పార్టీ అనే వాళ్ళు పాండవులో, కౌరవులో గెలవాలి తప్ప మరో శక్తిగాని, మరో పార్టీ గాని, మరో ఉద్యమం గాని, ప్రజలు గాని గెలవకూడదు అనే రాయలసీమ ఫ్యాక్షన్ లాంటి తత్వంలో ఉన్నారని అర్థం.

లిపి రూపొందిన తర్వాత తర్కవాదాలలో గెలుపు ఓటములతో పని లేకుండా పరోక్ష జ్ఞానం తరతరాలకు అందడం సులభమైంది. సంస్కృతి సంప్రదాయాలు, అలవాట్లు, భాష యిప్పటికి లిపితో కాకుండా ఇంట్లో, యిరుగు పొరుగుతో అనుకరణ ద్వారా రూపొందుతాయి. లిపి నాగరిక మానవునికి చిహ్నం. ఈ రోజు మార్కోని, గ్రహంబెల్, ఐన్‌స్టీన్, న్యూటన్, నోబెల్, మార్క్స్ ఎంగిల్స్, లెనిన్, మావో, గాంధీ , నెహ్రూ కన్నా ఎక్కువ విషయాలు ఇంటర్ విద్యార్థికి తెలుసు. ఆలోచనా తీరుల్లో మునుపటి మహామేధావులకన్నా యిప్పటి విద్యార్థులకు ఎక్కువ విషయాలు తెలుసు.

తెల్సుకుంటూ పోయిన జ్ఞానం పెరిగి పెరిగి ఎన్నో శాస్త్రాలుగా రూపొందాయి. ఏ శాస్త్రానికి ఆ శాస్త్రానికి ఆ శాస్త్రం తెల్సుకోవడం, కనుక్కోవడం, కొత్తవి ఊహించడం, అభివృద్ధి పరుచుకోవడం, వివేచించడం అనే క్రమాలు రూపొందించుకున్నాయి. వీటన్నిటి క్రమాలను తెల్సుకోవడాన్ని ''గతి తర్కం'' అని పిలుస్తారు. ఈ దృష్టిని భౌతిక వాద ప్రాపంచిక దృక్పథం అని అంటారు. ప్రతి శాస్త్రానికి తర్కం దేనికదిగా రూపొందాక తర్క శాస్త్రం యొక్క అవసరం తీరిపోయింది. అన్ని శాస్త్రాల్లో రూపొందిన, ఎదిగిన మానవ జ్ఞానక్రమాలను, వాటిలోని సూత్రాలను ఒక్కచోట చేర్చి వాటన్నిటిని సమన్వయికంచి కొన్ని సాధారణ సూత్రాలుగా రూపొదందించడం మొదలైంది. సాధారణ సూత్రాలు సైన్సు యొక్క క్రమాలను తెల్సుకోవడానికి తిరిగి వస్తాయి. అయితే సాధారణ సూత్రాలే సైన్సుకాదు. సైన్సును తెల్సుకోవడానికి ఉపయోగపడేవి మాత్రమే. సాధారణ సూత్రాలను సైన్సుపై రుద్దడానికి కాదు. సైన్సును మరింత తెలుసుకోవడానికి, కనుక్కోవడానికి, అన్వేషించడానికి, ఊహించడానికి అందుకు సహకరించే వాటిని సాధారణ సూత్రాలుగా రూపొందించుకోవడం జరుగుతూ వస్తున్నది. సైన్సుపై సాధారణ సూత్రాలను రుద్దితే అది తిరిగి వెనకటి తర్కశాస్త్రంలోని తర్కం, వితండం, జల్పం, ఛలంగా మారిపోతాయి. మార్క్సిస్టులు ఈ పని చాలానే చేసారని ఎంగెల్స్ వాపోయాడు.

అందరూ అంగీకరించిన, మానవ సమాజం సాధించిన అత్యున్నతస్థాయి జ్ఞానాన్ని అందుబాటులోకి వచ్చిన మేరకు దాన్ని ''కామన్ సెన్సు'' (ఇంగిత జ్ఞానం) అనిపిలుస్తారు. ఇంగిత జ్ఞానం అనేది ఒక సమాజపు సాధారణ స్థాయిని తెలుపుతుంది. అలా శుష్కతర్కం స్థానంలో ఇంగిత జ్ఞానం ప్రాధాన్యత వహించింది. అలాగే తత్వ శాస్త్రం స్థానంలో ప్రాపంచిక దృక్పథం ప్రాధాన్యతలోకి వచ్చింది. తర్క శాస్త్రం, తత్వ శాస్త్రం ఆచరణతో ప్రతక్ష సంబంధం లేకుండా కూడా కొనసాగే శాస్త్రాలు. కాగా ఇందుకు విరుద్ధంగా ఇంగిత జ్ఞానం, ప్రాపంచిక దృక్పథం, విశ్వాసం, సంస్కృతి అనేవి ఆచరణతో ప్రతక్ష సంబంధమున్న శాస్త్రాలు. అలాగే సామాజిక శాస్త్రాల అభివృద్ధి ఎటుసాగినా సామాజిక న్యాయం, సామాజిక మార్పు అనేవి ప్రాధ్యన్యతలోకి వచ్చాయి.

దృక్పథాలన్నీ విశ్వాసాలే. ఎవరికి వారు తర్కాన్ని నిర్మించుకున్న విశ్వాసాలనే దృక్పథం అంటున్నాము. విశ్వాసం వ్యక్తి స్థాయి నుండి సామాజిక స్థాయిలోకి మారినప్పుడు వ్యవస్థీకృతం అయిందంటారు. వ్యవస్థీకృతమయ్యేది మతంగా మారుతుందని అంటుంటారు. అయితే ఏ దృక్పథమైనా ఈ అర్థంలోనే విశ్వాసంగానే కొనసాగుతుంది. మతం, సంస్కృతి, ఫ్యాషన్ ఒకే విషయం యొక్క మూడు స్థాయీ దశలు. హృదయం స్పందించి ఒక విషయాన్ని స్వయంగా ఆచరించడం ఫ్యాషన్ అనుకుంటే దాన్ని ఒక సాంప్రదాయంగా ఆచరింపజేసే స్థిరీకృత రూపమే సంస్కృతి దానికి తార్కిక తాత్వీక మద్దతు తెలిపేది మతం. లేదా దృక్పథం లేదా విశ్వాసం. ఉదా॥కు ధోతి ఒకప్పుడు ఫ్యాషన్ ఇప్పుడు కొందరికది సంప్రదాయం మతం. ప్యాంటు, షర్టు ఒకప్పుడు ఫ్యాషన్ ఇప్పుడు అది ఒక సంస్కృతి సంప్రదాయం. ఫ్యాషన్ స్థాయిలో ఉన్నపుడు మార్చుకోవడం తేలిక. సంస్కృతిగా మారినపుడు విశ్వాసంగా మారినపుడు మార్చుకోవడం కష్టం. ఇలా మతాన్ని, దృక్పథాన్ని, విశ్వాసాన్ని మార్చుకోవడం ఇంకా కష్టం. తార్కిక సత్యాన్ని వాస్తవిక సత్యంతో సంబంధం లేకుండా, విడదీసి నమ్మినపుడు ఆ విశ్వాసాన్ని మార్చడం కష్టమౌతున్నది.

వాస్తవం ఒక్కటే. దక్పథాలు, దారులు అనేకం. అది నేనుల పరస్పర సంబంధంలో ఒకే అది (సూర్యుడు) అనేక నేనుల్లో అనేక విధాల దృక్పథాలు, భావనలు, ముద్రలు, అనుభూతులు, ఆచరణలుగా కనపడడానికి, వాటికి భిన్న విలువలు కోణాలు ఏర్పడ్డానికి అది యొక్క విభిన్న పార్శ్వాలతో పాటు నేనుల్లోగల భిన్న స్వభావాలు, స్థల కాలాలు జీవిత క్రమాలు, విశ్వాసాలు ప్రియారిటిలు, విలువలు మొదలైనవి ప్రధాన కారణం. ఇతర అదిలు, నేను వాటి పరస్పర సంబంధంలో పరస్పర ప్రభావం మరో ప్రధాన కారణం. దీన్ని ప్రకృతి సమాజం పరిసరాలు అని పిలువ వచ్చు. అందువల్ల చూసే కన్నును బట్టి, విశ్వాసాన్ని బట్టి అది యొక్క స్వభావం అది అయినా కాకపోయినా అది నేనులో అది సంబంధంతో రూపుదిద్దుకున్న కొత్తది కావచ్చు. అది రెంటి సంబంధంలో సృష్టి అయిన అదనపు విలువ అదనపు జ్ఞానం అవుతుంది.

మాటలకందని భావాలుంటాయి. ఆచరణకందని భావాలుంటాయి. స్పందించగలిగే ప్రతి హృదయానికి ఈ విషయం తెలుసు. తర్కం వ్యక్తీకరించే భావాలతో చర్చిస్తుంది. చాలామంది తమ భావాల్ని పూర్తిగా వ్యక్తం చేయలేరు. ఒక్కోసారి వ్యక్తం కన్నా అవ్యక్తమే ఎక్కువగా ఉంటుంది. కళ్ళు చెప్పే భావాలు భాషకందకపోవచ్చు. సన్నిహితులు చనిపోయినప్పుడు ఏడ్చే ఏడుపు ద్వారా మొత్తం భాధను వ్యక్తం చేయగలమా? ఎంతగొప్ప రచయితకైనా, కళాకారుడికైనా అది సాధ్యమా? అందువల్ల రాసే చేయి, మాట్లాడే నోరు, వ్యక్తీకరించే శక్తి, వ్యక్తీకరించాల్సిన అవసరం లేనంత మాత్రాన భావాలు లేనట్టు కాదు. తర్కం చర్చ అనేవి భావాలను మాటలకు పరిమితం చేసి అవ్యక్తాన్ని, మౌనాన్ని, నిశబ్దాన్ని నిరాకరిస్తుంది. తర్కంలోని మరో ప్రధానలోపం ఇది.

ఏ శాస్త్రానికి ఆ శాస్త్రం వేల ఏళ్ళ ప్రతక్ష అనుభవాల పరిణితిక్రమంలో తనదైన అడిటింగ్, పునర్వివేచన, తర్కాన్ని రూపొందించుకోవడం జరిగింది. అందువల్ల కేవల తర్కం, శుష్క తర్కంగా మిగిలిపోయింది. దానిలో అభివృద్ధి జరుగలేదు. అన్ని శాస్త్రాల్లో జరిగిన అభివృద్ధి సూత్రాలను ఒకచోట చేర్చి మానవ సమాజం స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం, కరుణ, ప్రేమతో అందరు సమానంగా ఎదుగగలిగే ప్రత్యేక కృషితో సమన్వయించడం సామాజిక శాస్త్రాలు చేస్తున్నపని. ముఖ్యంగా, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, సమాజ శాస్త్రం, నీతి శాస్త్రం, న్యాయ శాస్త్రం, పౌరనీతి శాస్త్రం, అలంకార శాస్త్రం, తత్వ శాస్త్రం అన్ని శాస్త్రాల్లో జరిగిన అభివృద్ధిని వాటి సాధారణ సూత్రాలను ఒకచోట చేర్చి సమన్వయించి సమాజ వ్యవస్థలను రూపొందించే కృషిచేస్తున్నాయి. మానవ సమాజం సాధించిన సైన్సు ఫలాలు అందరికి అందడం, అసమానతలు కనిష్ట స్థాయికి తగ్గించడం పరస్పర ప్రేమ, సహృదయత పరోపకారం అనేవి అన్నిటా ఉన్న సాధారణ తత్వం ప్రజానుకూలమైనది. అలా లేనిది ప్రజానుకూలమైనది కాకపోవచ్చు. అది ప్రజా వ్యతిరేకమైనది కావచ్చు. కేవలం తర్కం మీద ఆధారపడితే నోరున్నవాడిదే ఊరవుతుంది. ప్రతి మనిషికి, ఒకే విలువ, ఒకే ఓటు అనేది అత్యున్నత స్థాయికెదిగిన మానవ తత్వచింతన. రాజకీయ రంగంలో ఇది చట్టబద్ధంగా అమలులో ఉంది. మిగతా రంగాల్లో దీన్ని సాధించాల్సి ఉంది. కులం, మతం, ఆడమగ విచక్షణ అందరు సమానం అనే దాన్ని అడ్డగిస్తున్నాయి. మానవీయ సమాజంగా ఎదగడానికి అడ్డొచ్చే ప్రతిదాన్ని చైతన్యవంతంగా మార్చడం ద్వారా మానవ సమాజం నూతన సమాజంగా రూపొందుతుంది.

(సమాప్తం)

# వేమన

## (వేమన జయంతి జనవరి 18)

**- డా. బి. పార్వతి**

వేమన గురించి ఎంతోమంది పాశ్చాత్యులు, తెలుగువారు పరిశోధన జరిపారు. ఆయన గురించిన ప్రథమ ప్రస్తావన ఫ్రెంచి దేశస్థుడైన **J.A. Dubois** తను రాసిన హిందువుల అలవాట్లు ఆచారాలు అనే పుస్తకంలో చేశాడు. **Lord William Bentinck** ఆ పుస్తకాన్ని ఎనిమిదివేల రూపాయలకి **East India Company**కి కొని సేకరించాడు. మద్రాసు **Civil Service**లో వున్న సి.పి. బ్రౌన్ 1824లో **Dubois** పుస్తకం చదివిన పిమ్మట వేమన పట్ల ఆసక్తి కలిగి బళ్ళారి, కడప, మద్రాసు, విశాఖపట్నం నించి తాళపత్ర గ్రంథాలు సేకరించి పండితుల చేత పరిష్కరింపజేసి ప్రతులు తయారు చేశాడు. ఇప్పటి వరకు లభించిన ఆధారాల ప్రకారం తెలుగులో ముద్రించిన తొలి పుస్తకం బ్రౌను పరిష్కృతమైన వేమన పద్యాలని 'యోగి వేమన తెలుగు విజ్ఞాన కేంద్రం' స్పెషలాఫీసరుగా పనిచేసిన బంగోరె 1839లో బ్రౌను ముద్రించిన వేమన పద్యాల పునర్ముద్రణ పీఠికలో పేర్కొన్నాడు. **"No poem or classical composition in Telugu has hitherto been printed; and I believe no translation of a classic into English has been attempted'** అని బ్రౌను 1824లో **Preface to Vemana (Verses of Vemana in the Telugu Original with English Version, C.P. Brown)** లో పేర్కొన్నాడు. ఈ విధంగా ముద్రణ, అనువాదాలకి ఏక కాలంలో నోచుకున్న తొలి తెలుగు పుస్తకం వేమన పద్యాలు.

వేమన పట్ల ఆసక్తిని చూపిన ఇతర పాశ్చాత్యులలో **G.A. Grierson, G.U. Pope, R.M. Macdonald, Henry Bowers, Dr. L.D. Barnett, Charles E. Gover, W.H. Campbell** వున్నారు. గ్రీకు సాహిత్యానికి **Lucian** ఎటువంటివాడో తెలుగు సాహిత్యానికి వేమన అటువంటి వాడని బ్రౌను అభిప్రాయం. వేమన పద్యాలలో తీయదనం చక్కని లయ వున్నాయని **G.U. Pope,** యూరపు దేశస్థులు వేమన పద్యాలని గుర్తించారని, అయితే తెలుగు దేశంలో పండితులు, విద్యార్థులు ఈ పద్యాలు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో చేర్చటానికి విముఖత చూపించారని **R.M. Macdonald,** అసలు వేమన పద్యాలని పాఠ్యపుస్తకాలనించి పూర్తిగా తొలగించాలని, ఆయన తన కాలం కంటే ముందున్నవాడని, ఎంతో చిత్త శుద్ధితో ఆశయ సాధనకి ప్రేరణ ఇచ్చాడని **Henry Bowers,** వేమన ఎప్పుడూ మానవతా దృక్పథానికి విలువ ఇచ్చాడని, ప్రపంచపు బోధకులలో ప్రథమ శ్రేణికి చెందిన వాడని **L.D. Barnett,** వేమన ఏకేశ్వర వాది, చక్కటి మాటల పొందిక వున్నా, తమిళ కవి తిరువళ్ళువారు కంటె తక్కువ వాడని **Charles E. Gover** (ఈయన కూడా బ్రౌను తరవాత వేమన పద్యాలని అనువదించాడు), సన్యాసాన్ని, ముక్తి మార్గాన్వేషకులని వేమన విమర్శించిన తీరు **Wychiffe** ని **Martin Luther in** జ్ఞాపకం చేస్తుందని **W.H. Campbell** అభిప్రాయపడ్డారు. సంఘంలో వున్న మతమౌఢ్యం, అహంకారం కల్పితాలైన సాహిత్యపు విలువలు వేమనకి ఉచిత స్థానం కలగకుండా అడ్డుపడ్డాయని కూడా ఆయన పేర్కొన్నాడు.

తెలుగు విమర్శకులలో సర్ కట్టమంచి రామలింగారెడ్డి, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ వేమనని ఉచిత రీతిగా గుర్తించి, అపారమైన వేమన ఆలోచనా శక్తిని, వైవిధ్యాన్ని, భావ వైశాల్యాన్ని వెలుగుకి తెచ్చారు. ఆధునికులలో వేమనపైన విశేషమైన పరిశోధన చేసిన వారిలో కీ॥శే॥ నార్ల వేంకటేశ్వరరావు, ఆరుద్ర, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఎన్. గోపి, మా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు కొర్లపాటి శ్రీరామమూర్తి వున్నారు. ఈ విధంగా పాశ్చాత్యులనీ, పండితులనీ, పామరులనీ సామాన్య జనాన్ని కూడా స్పందింపజేసిన ఘనత వేమన కవిత్వానికి వుంది.

నిజానికి వేమన శతకం అని వాడుకలో వున్న పద్యాలు శత సహస్రాధికమే. సంస్కృత రామాయణంలోని కొన్ని శ్లోకాలలో శతక రచనకి ప్రాతిపదిక కనిపిస్తూ వుండగా, ప్రాకృతంలో కూడా శతకాలుండేవని పండితులు చెప్తున్నారు. గ్రీకు, లాటిన్ భాషలలో ఈ రచనలకి ఇంచుమించు సాటియైన **"Garlands'** అని వున్నాయి. ఈ రచన భక్తి, వీర, శృంగార, హాస్య రస ప్రధానంగా జరిగింది. కావ్య రూపంగా, కథా రూపంగా చెప్పలేని ఎన్నో సుభాషితాలు ఈ చిరుపద్యాల రూపు దాల్చటం వలన శతక రచన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పదమూడవ శతాబ్దంలో మల్లికార్జున పండితారాధ్యునితో తెలుగులో శతక రచన ప్రారంభమైంది. ఎక్కువగా ఆటవెలది, తేటగీతి, కంద పద్యాలలో శతకాలు కనిపిస్తాయి. సీసంలో అరుదైనప్పటికీ చెప్పటం జరిగింది. శతకంలో నాలుగు పాదాల పద్యంలో నాలుగవ పాదాంతం కానీ, నాలుగవ పాదం మొత్తంగా కానీ మకుటంగా వుంటుంది.

''ఉప్పుకప్పురంబు నొక్క పోలిక నుండు
చూడ చూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ వినురవేమ''

''అల్పుడెప్పుడు బల్కు నాడంబరము గాను
సజ్జనుండు బలుకు చల్లగాను
కంచు మ్రోగినట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినురవేమ''

ఈ రెండు పద్యాలు తెలియని వారు తెలుగునాట వుండరేమో. మహాభారతాన్ని ఆంధ్రీ కరించ బూనిన ఆదికవి నన్నయ, పూరించి పూర్తి చేసిన తిక్కన, ఎఱ్ఱాప్రగడల కవిత్రయాన్ని గురించి తెలియనప్పటికీ తెలుగువారికి వేమన పరిచయం తప్పక చిన్ననాట నే జరుగుతుంది. సరళంగా, సులభంగా, సుబోధకంగా వుండే ఈ పద్యాలు కేవలం చిరుతప్రాయం వారికే పరిమితమవ్వటం అనేది కొంత విచారించతగ్గ విషయం. మనుషులలోని వ్యత్యాసాలను సున్నితంగా వివరించిన వేమన తనకాలం నాటి దురాచారాలను, మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని, మూఢత్వాన్ని తీవ్రంగా విమర్శించటమే కాకుండా ఆత్మవిమర్శని ప్రోత్సహించి వేదాంత మార్గాన్ని, జ్ఞాన మార్గాన్ని బోధించే పద్యాలు ఎన్నో చెప్పాడు.

వీటిలోని విశేషం ఏమిటంటే చెప్పదలుచుకున్న విషయం సూటిగా నిర్మొహమాటంగా చెప్పటమే కాకుండా నొప్పించిన నోటితోనే వేమన నవ్వు పుట్టించటం. ఉప్పుకప్పురంబు పద్యం చెప్పిన కవి విప్లవాత్మక యోగి, దేశదిమ్మరి, దిగంబరుడు అని ఊహించటం కష్టం. పండితులు తిరస్కరించి త్రోసిపుచ్చిన వేమన కవిత్వం పామరుల మనసులని తాకి తాటాకులలో భద్రపరచబడటం జరిగింది. వేమన ఏయే విషయాల గురించి ప్రస్తావించాడో దేని గురించి కవిత్వం చెప్పలేదో ఆలోచించాలి. మానవ నైజంలో భాగమైన అజ్ఞానం, అసూయ, మూర్ఖత్వం మొదలైన గుణ ప్రవర్తనని ఆయన ఎత్తి చూపాడు.

'' ఆదిమ కవులవలె అల్పుండు తానెరిగి / చెప్పలేడు గాని తప్పు బట్టు
త్రోయనేర్చుకుక్క దొంతులు బెట్టునా'' అన్న పద్యం మూడోపాదంలో ఇచ్చిన ఉదాహరణ చెప్పిన పోలిక అల్పబుద్ధికి చక్కటి వివరణ. మానవ నైజాన్ని ఎత్తి చూపే మరొక పద్యం-

''అంతరంగమందు అపరాధముల చేసి / మంచి వాని వలెను మనుజుడుండు
ఇతరులెరుగకున్న ఈశ్వరుడెరుగడా'' ఇందులో మొదటి రెండు పాదాలలో మనిషి తప్పుకప్పిపుచ్చే స్వభావాన్ని మూడవ పాదంలో దాని వైఫల్యాన్ని వేమన చూపించాడు. కోటి విద్యలూ కూటి కోసమే కాబట్టి ప్రాపంచిక విషయ వాసనలో చిక్కుకున్న మనిషి కలత చెందటం చూసి వేమన

''సతుల గవయనేల సుతుల బడయనేల / వెతల పడగనేల వెఱ్ఱితనము
నేలమీద రాయి నెత్తి కెత్తినయట్లు'' అని అన్నాడు.

ధనానికి మనిషికి వున్న సంబంధం వేమన సూక్ష్మదృష్టికి చిక్కి విమర్శపాలైంది. ధనాకర్షణ శక్తి నించి సామాన్యులే కాదు అవతార పురుషుడైన కృష్ణుడు కూడా తప్పించుకోలేక పోయాడని వేమన ఇలా అన్నాడు:

''పాల సాగరమున పవ్వళించిన హరి / గొల్లయిండ్ల పాలు కోరనేల
ఎదుటివారి సొమ్ము లెల్లవారికి తీపి''

లోకంలో పిల్లికి బిచ్చం పెట్టని లోభులగురించి :

''గొడ్డుటావు బితుక కుండ గొంపోయిన / పండ్లురాలదన్ను పాలనీదు
లోభివాని నడుగ లాభంబు లేదయా'' అని,

''లోభివాని జంప లోకంబు లోపల / మందు వలదు వేరె మతము గలదు
పైక మడుగ చాలు భగ్గున పడిచచ్చు'' అని లోభికి ప్రాణాంతకమైన విషయం గురించి వేమన వివరించాడు 'భగ్గున పడి చచ్చు' అన్న రెండు మాటల్లో. ధన మోహంతో జీవించే మనిషి మంకుజీవి అని 'కొంచబోడు వెంట గుల్లకాసునురాదు' అని తెలిసి కూడా మంచి మాటలాడే లోభి

''నమశివ యనవచ్చు నారాయణనవచ్చు / మేలు వారి నమ్మి మెచ్చవచ్చు
కొంగు కాసు విడిచి గొబ్బున నీలేడు'' అని వేమన తేల్చి చెప్పాడు.

''పంకజాక్షిగన్న బంగరు పొడగన్న / దిమ్ముబట్టి యుండు తెలివికెల్ల
మనుషులకును తత్వ మహిమెట్లు గలుగురా'' అన్నాడు.

స్త్రీలను గురించి, వేశ్యల గురించి, అక్రమ సంబంధాల గురించి చెప్పిన ఎన్నో పద్యాలు అనాగరికంగా రోతపుట్టించేవిగా వున్నా అవాస్తవాలు, అసత్యాలు మాత్రంకావు. ఈ పద్యాలు నిలవటానికి కారణం వాటి సత్యదర్శనమే. కాంతా కనకాల తర్వాత ప్రజలని వశపరచుకొన్న ఆచార వ్యవహారాలపైన భక్తి ముక్తి తత్వము మోక్షములపైన దృష్టి సారించిన వేమన మనోధర్మానికి, మానవత్వానికి అవి ఆటంకాలు కావటం చూసి వాటిని దుయ్యబట్టాడు. 'మన్ను మెత్తి కరిగి మరి రూపు గావించి గుంటనిండ బూడ్చి గురుతునిలిపిన' దానిని మనుషులుకూడి దేవుడని భావిస్తారు కానీ

''పరగరాళ్ళ దెచ్చి పరగ గుడుల గట్టి / చెలగి శిలల సేవ జేయనేల
శిలల సేవ జేయఫలమేమి గల్గురా'' అంటూ

''శిలను ప్రతిమజేసి చీకటింటను బెట్టి / మ్రొక్కవలదు వెట్టి మూఢులార
యుల్లమందు బ్రహ్మముండుట తెలియదు'' అని వాపోయిన వేమన

''శివుడు గలడటంచు శిలలకు మ్రొక్కెడి / వెట్టి జీవులార వెతల విడుడి
జీవులందెకాక శిలల యేమున్నది'' అని ప్రశ్నిస్తూ దైవాన్ని వెతికే వారికి ఈ విధంగా చెప్పాడు:

''మంటలోహమందు మాకుల శిలలందు / పటము గోడలందు ప్రతిమలందు
తన్ను దెలియవరకు గలదా పరమాత్మ''

అయినా శరీరానికి బూడిద పూసుకున్నంత మాత్రాన శివభక్తి కాజాలదు ఎందువలన అంటే 'గాక బూడ్దెయందు గాడిద పొర్లదా' అన్న వేమన భక్తుల బాహ్య ప్రవర్తనని నిశితంగా విమర్శించాడు ఈ పద్యంలో:

''రాతి బసవని గని రంగుగా మ్రొక్కుచు / గునుక బసవని గని గుద్దుచుంద్రు
బసవ భక్తులెల్ల పాపులు తలపోయ''

''తొమ్మిది కంతల తిత్తి'' యైన దేహానికి అలంకారాలు చేసి కులాధిక్యతతో గర్వించినా అది తనది కాలేదన్న సత్యాన్ని గ్రహించమంటాడు. ఈ దేహంలో వున్న బ్రహ్మము తానని తెలియలేని మనుషులు పరదేహంలోని బ్రహ్మన్ని మాత్రం ఎలా గుర్తించగలరు? కాబట్టే మనుజ కర్మచేత మాలడయిన వానినంటి నీళ్ళలో మునిగిన నరపశువులకి

''మాలవానినేల మహిమీద నిందింప / నొడల రక్తమాంస మొకటిగాదె
వానిలోన మెలగు వారి కులంబేది'' / అనే విషయం గుర్తురాదని వేమన విచారించాడు.

సామాన్యులకి, అధములకీ తెలియని బ్రహ్మజ్ఞానము గురించి ప్రస్తావించకుండా, మనుషులకి ప్రధానంగా కావలసిన స్నేహభావాన్ని అవగాహనని పెంపొందించటమే ప్రధానమని అందుకు

''ఉర్వివారికెల్ల నొక్క కంచము బెట్టి / పొత్తుగుడిపె కులము పొలయ జేసి
తలను చెయ్యి బెట్టి తగనమ్మ చెప్పరా'' అని ఉదాత్తతని ప్రకటించాడు.

వేమన కవితా స్వరూపం ఇదీ అంటూ నిర్దుష్టంగా చెప్పేవీలులేదు. విభిన్న కోణాలతో ప్రకాశించే ఆయన కవిత్వానికి పూర్ణనదీ ప్రవాహానికి గల గాంభీర్యత, జలపాతానికి గల హోరు, వడి, మూఢత్వం చెదరగొట్టేవాడి, వివేకాన్నిచ్చే ఆలోచన, అజ్ఞానాంధకారాన్ని తరిమికొట్టే జ్ఞానప్రకాశం, తాత్త్వికచింతన మానవతా వాదం, కోపం, కరుణ, ఆగ్రహం - అన్నీ వున్నాయి. ఎప్పటి కప్పుడు పరిస్థితిని బట్టి, అవసరాన్ని బట్టి ఆయన పద్యం చెప్పినట్టు కనిపిస్తుంది. పరస్పర విరుద్ధాలైన రెండు ఆలోచనలకి ఉదాహరణగా ఈ రెండు పద్యాలనీ తీసుకోవచ్చు:

''నోరెరిగి తాము యేమియు
నేరని జంతువుల జంపి నెమ్మది తినుయా
క్రూరపు సంకర జాతుల
మారణ మేమందు నింక మహిలో వేమా'' అని మాంస భక్షణకి నొచ్చుకున్న వేమన శాకాహారం స్వీకరించటాన్ని కోపంగా వెటకారం చేశాడు ఈ క్రింది పద్యంలో:

''ఆకులన్ని దిన మేకపోతులకెల్ల
కాకపోయెనయ్య కాయసిద్ధి
లోకులెల్ల వెట్టి పోకళ్ళ బోదురు''

''సకల తీర్థములను సకల యజ్ఞంబుల
తలలు గొరుగకున్న ఫలము లేదు
మంత్రజలము కన్న మంగలి జలమెచ్చు'' అని వెటకారం చేసిన వేమన సమకాలికులలో ఎవరిని మెప్పించాడో తెలియదు కానీ చాలామందిని నొప్పించేవుంటాడు. అయినా ఎందరో అమాయకులకు, సామాన్య ప్రజానీకానికి మార్గదర్శకుడయ్యాడని చెప్పటం అతిశయోక్తి కాదు. పండితులు పట్టించుకోని ఈ పద్యాలని మెచ్చిన వారు ఎంతోమంది తాటాకుల మీద రాసి భద్రపరచటమే ఇందుకు నిదర్శనం. యోగి, జ్ఞాని అయిన వేమన కవి, సంస్కర్త, సత్యాన్వేషి, సత్యద్రష్ట అయి కూడా చమత్కారాన్ని, హాస్యాన్ని మేళవించి సమాజానికి మందలింపు ఎంత అవసరమో చక్కగా చెప్పాడు ఈ క్రింది పద్యంలో:

''చాకి కోక లుదికి చీకాకు పడజేసి / మైలదీసి లెస్స మడిచినట్లు
బుద్ధి జెప్పువాడు గ్రుద్దితే నేమయా'' అటువంటి వేమన పద్యాలు కాలంతో కలిసి పోకుండా నిలిపిన పండిత పామరులందరికీ తెలుగు వారిగా మనం ఋణపడివున్నాం.

# 2 1వ శతాబ్ది తాత్వికుడు పీటర్ సింగర్

- డా. ఎన్. ఇన్నయ్య.

గౌరి తీరిగ్గా టి.వి. చూస్తున్నది. అనాధ పిల్లల్ని అప్పగిస్తే లక్ష రూపాయలు ఒక్కొక్కరికీ యిస్తామని, అమెరికాలో పిల్లలు లేని సంపన్నులు పెంచుకోడానికి ముందుకు వస్తున్నారని ప్రకటన చూచింది. వెంటనే తనకు తెలిసిన వీధి అనాధ బాలుడిని టి.వి.లో చూపిన అడ్రస్‌కు చేరవేసింది. లక్షరూపాయలు కళ్ళజూసింది. హాయిగా కొత్తమోడల్ టి.వి. సెట్ కొనుక్కున్నది. విలాస వంతమైన హోటల్‌కు వెళ్ళి ఖరీదైన భోజనం చేసి తృప్తిగా తేపింది. ఇంతలో పక్కింటి లక్ష్మి వచ్చి గౌరికి ఒక వార్త చేరవేసింది. టి.వి.లో ప్రకటించినట్లు, కొనుక్కున్న పిల్లల్ని అమెరికా సంపన్నులకు చేర్చడం లేదట. పిల్లల్ని చంపేసి వారి కిడ్నీలు, లివర్, కళ్ళు విడి భాగాలుగా అమ్ముతున్నారట. గౌరి యీ దుర్వార్తకు అదిరి పడింది. ఇప్పుడేం చేయాలి. తన వద్ద వున్న డబ్బు తిరిగి యిచ్చేసి పిల్లవాడిని వాపస్ కోరాలా? వీధిలో దిక్కులేకుండా తిరుగుతున్న అబ్బాయి ఏమైతేనేం అని వూరుకోవాలా?

ఇది నైతిక సమస్య. ఇలాంటివి ఎదురైతే ఏం చేయాలి? ఆధునిక తాత్వికుడు పీటర్ సింగర్ చర్చను ప్రారంభించి పెద్ద దుమారం లేపాడు. సంపన్న దేశాలలో విలాసాలకు ఖర్చుచేసే వారు ఒక్కసారి ఆలోచించి, వాటిని తగ్గించుకుంటే, ఆ పొదుపుతో పేద పిల్లలు బాగుపడతారంటాడు.

పీటర్ సింగర్ హేతుబద్ధమైన ఉపయోగతా చింతనా పరుడు. మనం చేసే పనుల ఫలితాలను, బాగోగులను బట్టి మంచి చెడ్డలు నిర్ధారించాలంటాడు.

వస్తువులన్నీ వుండగా వాటిని మార్చేసి, లేదా అవతలపారేసి, కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన వాటికోసం సంపన్నులు పరుగెడుతుంటారు. సెలవుల్లో ఖరీదైన పిక్నిక్‌లకు వెడతారు. అత్యంత విలాసవంత హోటళ్ళలో బాగా ఖర్చుబెట్టి తాగుతారు, తింటారు. అవసరం లేని ఖర్చులు పెడతారు. ఆ డబ్బులో కొంతైనా విరాళంగా యిస్తే చాలామంది అనాధ పిల్లలు, పేద పిల్లలు బాగుపడతారంటాడు పీటర్ సింగర్.

తన వాదానికి మద్దత్తుగా పీటర్ సింగర్ మరో తాత్వికుడి రచనలు కూడా ఉదహరించాడు. న్యూయార్క్ యూనివర్శిటీ ఫిలాసఫర్ పీటర్ అంగర్ 1996 లో ప్రచురించిన పుస్తకంలో యిలాంటి వాదన ఆకట్టుకున్నది. **(Peter Unger: "Living High And Letting Die")**

అయితే పిల్లల్ని ఎందుకు కాపాడాలి? అంటే, రోగాలకు, ఆకలికి పిల్లలు బాధ్యులు కారు. వారిని కన్నతల్లి దండ్రులు, సమాజం అందుకు బాధ్యత వహించాలి. కనుక అలాంటి పిల్లల్ని ఆదుకోవడం బాధ్యతగా స్వీకరించాలని పీటర్ సింగర్ వాదించాడు.

బాల్యదశలో ఆకలి, రోగాలు లేకుండా బయటపడితే ఆ తరువాత వారి తిప్పలు వారు పడతారు. కనుక 2 వేల రూపాయలు దానం చేస్తే ఒక పిల్లవాడు ( లేదా బాలిక) ప్రమాద స్థితిని దాటి బయట పడే అవకాశం వుంది.

ప్రపంచంలో అనేక మంది ఆ మాత్రం దానం చేయగల స్థితిలో వున్నారు. అయినా ఉదాసీనంగా అశ్రద్ధ చేస్తున్నారు. ఎందరో పిల్లలు సహాయం అందక చనిపోతున్నారు. ఇదీ స్థితి.

జర్మనీలో రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యూదులను చంపారు, చిత్రహింసలకు గురి చేశారు. నాజీలు హిట్లర్ నాయకత్వాన జరిపిన యీ దారుణ అమానుష చర్యలు జర్మనీ పౌరులకు తెలుసు. అయినా వూరుకున్నారు. పిల్లలు చనిపోతున్నా బాధపడుతున్నా తెలిసీ కనీస దానం చేయక పోవడం అలాంటిదేనని పీటర్ సింగర్ అంటున్నాడు.

కనీస అవసరాలు వున్నవారు, విలాసాల జోలికి పోకుండా దానం చేయడం నైతిక బాధ్యత అని తాత్వికుడు పీటర్ సింగర్ విజ్ఞప్తి చేస్తున్నాడు. జీవించడమేకాదు. నైతికంగా మంచి జీవనం అవసరం ఆ దృష్ట్యా అతడు వాదిస్తున్నాడు.

## ఎవరీ పీటర్ సింగర్?

1946లో ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో పుట్టిన పీటర్ సింగర్ అటు ఆస్ట్రేలియాలోనూ, ఇంగ్లండ్‌లోనూ చదివి రెండేళ్ళు ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో లెక్చరర్‌గా పని చేశాడు. అమెరికాలోని కొన్ని విశ్వ విద్యాలయాలలో విజిటింగ్ లెక్చరర్‌గా అనుభవం పొందాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో మొనాష్ యూనివర్శిటీ ప్రొఫెసర్.

మానవ జీవ నీతి శాస్త్ర కేంద్రం డైరెక్టరుగా పీటర్ సింగర్ ప్రపంచ ఖ్యాతి పొందాడు. ఆస్ట్రేలియాలోని విక్టోరియా ప్రాంతంవారు ఆయన్ను సెనేటర్‌గా నిలబడమని కోరారు. 1992 నుండీ అంతర్జాతీయ బయో ఎథిక్స్ సంస్థ స్థాపకుడుగా కృషి చేస్తున్నారు. 1985 నుండీ బయో ఎథిక్స్ పత్రిక సహసంపాదకుడు.

ఇప్పుడు పీటర్ సింగర్‌ను అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్శిటీవారు మానవ విలువలు అధ్యయనం చేసే బయో ఎథిక్స్ కేంద్రం లో ప్రొఫెసర్‌గా ఆహ్వానించారు. ఆయన అంగీకరించి చేరారు. కాని ఆయన నియామకాన్ని ప్రశ్నిస్తూ ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో జీవకారుణ్య సంఘాలవారు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఎందుకని?

పుట్టిన పిల్లలు ఒకనెల లోపు వికలాంగులని, శారీరకంగా తీవ్ర లోపాలు వున్నాయని తెలిస్తే వారిని చంపేయడం మంచిదని పీటర్‌సింగర్ అభిప్రాయం. పిల్లలు సుఖ సంతోషాలను యివ్వాలేగాని, తాము బాధపడుతూ, తల్లి దండ్రులకు, సమాజానికి క్షోభ తీసుకొచ్చే రీతిలో పరిణమించరాదని ఆయన ఉద్దేశం. కనుక అలాంటి పిల్లల్ని నెల రోజుల లోపు చంపేస్తేనే అందరికీ మంచిదన్నాడు. దీనిపై ఆహాకారాలు బయలు దేరాయి.

గర్భ స్రావం అనుమతించాలనీ, తీవ్ర బాధలు భరించలేక ఎవరైనా చనిపోతామంటే వారిని అలా

చనిపోనివ్వాలని అందుకు డాక్టర్లు తోడ్పడడంలో తప్పు లేదని పీటర్ సింగర్ వాదించాడు. యూరోప్, అమెరికాలలో పెద్ద చర్చనీయాంశంగా యీ వాదం మారింది.

1968లో పీటర్ సింగర్ రెనాటా డయమంగ్‌ను వివాహమాడాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. రచనలతో బాటు, కూరగాయల పెంపకం, ఈత, నడక ఆయన అభిరుచులు.

కోతుల జాతిని సంరక్షించాలనే **(Ape Project)** పథకంలో విశ్వవిఖ్యాత శాస్త్రజ్ఞుల మద్దత్తు పీటర్ సింగర్ గడించాడు. పరిణామంలో మానవులతో సమంగా వున్న వివిధ కోతి జాతుల్ని ఏమాత్రం సంహరించరాదని వాదించాడు. కోతి అంగాలు పరిశోధనకు స్వీకరించడం తప్పు కానప్పుడు, మెదడు లేకుండా పుట్టిన శిశువుల అంగాలను తీసుకోవచ్చు గదా అంటున్నాడు.

21వ శతాబ్దంలో కొత్త సూత్రాలు రావాలి. లోగడ టాలమీ విశ్వాసాన్ని కోపర్నికస్ దెబ్బ కొట్టాడు. అతడి లోపాల్ని కెప్లర్ సరిదిద్దాడు. అలాగే ముందుకు సాగడంలో మార్పులు చేసుకోవాలి. ఇందుకు గాను పీటర్ సింగర్ కొత్త నిబంధనలు సూచించాడు. బైబిల్ 10 ఆజ్ఞలు యిప్పుడు మార్చుకోవాలంటున్నాడు. అందులో ముఖ్యమైనవి:

1. మానవ జీవితం మారుతుందని గ్రహించాలి.

2. నీ నిర్ణయాలకు వచ్చే ఫలితాలను స్వీకరించే బాధ్యత నీదే.

3. బ్రతకాలా వద్దా అనేది వ్యక్తి యిష్టం. దానిని గౌరవించు.

4. పిల్లలు కావాలంటేనే వారిని యీ లోకంలోకి తీసుకురావాలి.

5. జీవరాసులలో విచక్షణ చూపవద్దు.

జంతువులపట్ల హింసను పీటర్ సింగర్ తీవ్రంగా ఖండించాడు. ఆయన రాసిన పుస్తకం జంతు విమోచన **(Animal Liberation)** చదివి అనేక మంది శాఖాహారులుగా మారిన దాఖలాలున్నాయి. జంతువుల హక్కుల పోరాట కర్తలకు యిది వేద ప్రమాణంగా వుంది.

అధునాతన ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాలో (1996) ఎథిక్స్ పై పీటర్ సింగర్ విపుల వ్యాసం రాశారు. ప్రాచ్య పాశ్చాత్య నైతిక పరిణామాన్ని చక్కగా సమీక్షించారు. 21వ శతాబ్దంలో ఎదురుకాబోతున్న నైతిక సమస్యల ప్రస్తావన తెచ్చారు. ఈ విషయంలో ఆయన జొనాతన్ గ్లోవర్ రచన చూపారు. **(Jonathan Glover, 1984, What Sort of People should there be?)** రానున్న అనేక క్లిష్ట సమస్యలను, నైతిక సంక్షోభాలను ఆయన మన దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా జనిటిక్స్ రీత్యా యీ సమస్యలు తలెత్తనున్నాయన్నారు. పిల్లలు లేని వారికి తోడ్పడే నిమిత్తం, స్థంభింపజేసిన రేతస్సు కణాల ద్వారా ఒకామె గర్భం ధరిస్తుంది. తీరా పిల్ల పుట్టిన తరువాత తానే అట్టిపెట్టుకుంటాననంటే, ఏమౌతుంది? మనకు అనూహ్యమైన నైతిక సమస్యలు వస్తాయంటున్నాడు.

భారత దేశంలో నీతి, తత్వం, మతం కలసి పోయిన రీతిని పీటర్ సింగర్ ప్రస్తావించాడు. వేదాలు, బౌద్ధ, జైనాలు, చార్వాన్ నీతి విషయాలు చూపాడు. జంతువుల్ని చంపి యజ్ఞాలు చేస్తే పుణ్యలోకాలకు పోతారనే వేదాలను ప్రశ్నిస్తూ, అలాగయితే వృద్ధ తల్లి దండ్రులను చంపేస్తే సరాసరి స్వర్గానికి పోతారుగదా అని చార్వాకుడు చెప్పిన ఉదంతాన్ని పీటర్ సింగర్ ఆశ్చర్యంతో చూపాడు.

పాశ్చాత్య లోకంలో, తాత్విక ప్రపంచం పీటర్ సింగర్‌ను పట్టించుకుంటున్నది.

గ్రేట్ ఏప్ ప్రాజెక్టు ప్రకారం కోతుల్ని చంపరాదని అంగీకరించే వారు రాయడానికి వీలుగా అడ్రసు యిచ్చారు:

The Great Ape Project
PO Box 1023
Colling Wood
Melbourne, Victoria
Australia 3066
Fax 39 2481 4784

Peter Singer కొన్ని ముఖ్య రచనలు:

1. Animal Liberation
2. Marx
3. The Expanding Circle : Ethics & Sociobiology
4. Practical Ethics
5. Rethinking : Life and Death
6. Democracy and Disobedience
7. Reproduction Revolution : Should the body life

Articles :

Ethics : Encyclopedia Britannica 1996 edition

Co - Editor : Bio Ethics Journal

**సవరణ**

'మిసిమి' పోస్టుమాడర్నిజం ప్రత్యేక సంచిక 396వ పేజీలో 'నేనూ - చీకటి' నవలను కాశీభట్ల వేణుగోపాల్ రచించారు. కాశీభట్ల విశ్వనాథ్‌కాదు.

- నవీన్



జపాన్‌లోని అతి వృద్ధ కవలలు. వీరి పేర్లు కిన్, జిన్‌లు.
కిన్ అంటే బంగారం, జిన్ అంటే వెండి (బంగారు, వెండి పాదరక్షలతో)

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



**అపోలో - డాఫెన్‌లు, చిత్రకారుడు - పోసిన్**

బెరినిని సృజనాత్మకతను వ్యక్తీకరిస్తూ, పాలరాతి మలుపుల్లో మానవ ప్రయత్న పరమక్షణంగా భాసిల్లుతున్నాయి. సూర్యదేవుడు వెంటపడగా భయంతో తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్న డాఫెన్, చివరకు ఒక చెట్టుగా మారి, అతన్నించి తప్పించుకొంటుంది.